నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
సోమవారం | 12 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

చిరంజీవిని కలిసిన మవీన్‌గౌడ్



నవతెలంగాణ-రామచంద్రాపురం

ప్రముఖ సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవికి కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందించడంతో ఉమ్మడి మెదక్ జిల్లా చిరంజీవి అసోసియేషన్ అధ్యక్షులు మవీన్ గౌడ్ ఆదివారం చిరంజీవి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మవీన్ గౌడ్ మాట్లాడుతూ.. సినీ ప్రముఖునిగా, రాజకీయ నాయకునిగా ఎన్నో సేవలు చేసిన చిరంజీవిని కేంద్ర ప్రభుత్వం గౌరవించి పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందించడం పై సంతోషం వ్యక్తం చేశారు. ఆయన స్ఫూర్తితో ఉమ్మడి మెదక్ జిల్లాలో మరెన్నో సేవలు విస్తరిస్తామన్నారు.

గీతం అధ్యాపకుడు జగదీశ్వర్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-పటాన్‌చెరు

'కావిటేటింగ్ ఫ్లో పాస్ట్ యాక్సిసిమెట్రిక్ బాడీస్ యొక్క ప్రయోగాత్మక, సంఖ్యాపరమైన పరిశోధన' చేసి, దానిపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన హైదరాబాద్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జగదీశ్వర్ కందులను డాక్టరేట్ వరించింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆయన ఈ పట్టాను అందుకున్నారు. ఓయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ పి.ఉషశ్రీ, సీబీఐటీలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫె సర్ రవీందర్ రెడ్డి మార్గదర్శనంలో ఈ పరిశోధనను చేపట్టినట్టు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాస్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.



గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

గ్రామాలలో ఎప్పటికప్పుడు సమస్య లేకుండా పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి జిల్లా బీసీ సంక్షేమ అధికారి సరోజ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ మండలంలోని మాలపల్లి, రాములపల్లి గ్రామాలలో సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, నర్సరీని పరిశీలించారు. డంపింగ్ షెడ్, వాటర్ ట్యాంక్‌లను సందర్శించారు. తాగునీటి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు కల్పన, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కమిటీలోకి ముగ్గురు..





నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కమిటీలోకి జాలిగపు శిరీష, రాంసాగర్ మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, తాటికొండ రవి ముగ్గురు ఎంపికయ్యారని పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి తెలిపారు. శనివారం హైరాబాద్ లో జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ ముగ్గురికి ఆమోదం తెలిపారన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఈ ముగ్గురు విద్యార్థి దశ నుండే ఉద్యమాల్లో ఉంటూ విద్యార్థి, వ్యవసాయ కార్మిక, మహిళా ఉద్యమాల్లో గత పదిహేను, ఇరవై ఏండ్ల నుంచి పనిచేస్తూ నిరంతరం ప్రజా ఉద్యమాల్లో ఉంటున్నారన్నారు. జిల్లా కమిటీకి ఎంపికైన శిరీష, రవీందర్, రవి మాట్లాడుతూ.. పార్టీ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్మిస్తామని, పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల ఉద్యమాలు నిర్మిస్తామన్నారు.



దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు

ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం సమ్మె కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పదేండ్లుగా భారతదేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోడీ నేటికీ ఆదాని, అంబానీలకు అనుకూల నిర్ణయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలి మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ మాట్లాడుతూ.. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, నిరుపేదల బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు లాంటి హామీలు విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులారా ఇకనైనా నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, పబ్లిక్ సెక్టార్లను ప్రైవేటు వ్యక్తులకు దారదత్తం చేస్తున్నారని మోడీ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా కార్యదర్శి సుందర్, రతన్‌సింగ్, రాములు,అశోక్, సహాయ కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదల ఎస్ఐగా మహేశ్వర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల నూతన ఎస్ఐగా మహేశ్వర్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతముందు ఇక్కడ పని చేసిన లక్ష్మారెడ్డి బదిలీలో భాగంగా జహీరాబాద్ పట్టణానికి వెళ్లగా.. జిల్లాలోని ఇంద్రకరణ్‌లో విధులు నిర్వహించిన ఎస్సై మహేశ్వర్ రెడ్డి గుమ్మడిదలకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



మంజీరా నదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ ఉమ్మడి మండల పరిధిలోని శివంపేట గ్రామ శివారులో ఉన్న పాత బ్రిడ్జి కింద నుంచి ప్రవహిస్తున్న మంజీరా నదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శివంపేట గ్రామ శివారులో ఉన్న బీరు పరిశ్రమ వద్ద గల పాత బ్రిడ్జి కింద ఓ యువకుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి మత్స్యకారుల సాయంతో మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడి వయస్సు సుమారు 30 నుండి 35 మధ్య ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదిలో ఉంచామన్నారు. ఎవరైనా గుర్తుపడితే 87126 56754 ద్వారా తమకు గానీ, 8712656723 ద్వారా జోగిపేట సిఐకి గానీ సమాచారం అందించాలన్నారు

ఎంపీడీఓ బదిలీ..

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా తనదైన శైలిలో విధులు నిర్వర్తించిన దమ్మని రాము బదిలైనట్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్ కమీషనర్ అనిత రామచంద్రన్ రాష్ట్రంలోని పలువురు ఎంపీడీఓ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల జారీలో మండల ఎంపీడీఓ దమ్మని రాము కరీంనగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీఓ దమ్మని రాము బదిలీపై మండలంలోని పలువురు ఆదివారం అసంతృప్తి వెల్లడించారు.

నాయబ్ తహసీల్దార్లదే హవా..!

- రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో వసూళ్ల దందా
- ఒక్కో రిజిస్ట్రేషన్‌కు ఒక్కోధర
- తహసీల్దార్ నుంచి కలెక్టరేట్ వరకు అన్ని తామే చూస్తామంటూ చలామణి



నవతెలంగాణ-ఝరాసంగం

తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో డిప్యూటీ తహశీల్దార్ల వసూళ్ళ హవా కొనసాగుతుంది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియల్లో అన్నితామే స్వయంగా చూసుకుంటామంటూ క్రయ, విక్రయాల్లో నాయబ్ తహసీల్దార్లు వసూళ్లకు పాల్పడుతున్నారంటూ బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ల వ్యవహారాల్లో ఒక్కో ఫైలుకు ఒక్కో ధర నిర్ణయించి నిబంధనలకు విరుద్ధంగా వసూ ళ్లు చేస్తున్నారని బాధితులు, రైతులు వాపోతున్నారు. రోజూ రోజుకు రెవెన్యూలో అవినీతి ఆగడాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఎప్పుడైనా అవినీతి ఆరోపణలో టాప్ స్థానం రెవెన్యూదే. అంతలా అవినీతి పేరుకుపోయిన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు వీఆర్వో వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేయడం జరిగింది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌ను సబ్ రిజిస్ట్రారు తొలగించి ధరణి పోర్టల్ తీసుకొచ్చి తహసీల్దార్లకు అప్పగించింది. అయినప్పటికి రెవె న్యూలో అవినీతి రూపుమాపడం లేదు. మొన్నటి వరకు వీఆర్వో ఆర్ఐ స్థాయిలో జరిగిన దందా నేరుగా డిప్యూటీ తాహసీల్దార్ స్థాయిలో రెవెన్యూ అక్రమాలు జరుగుతున్నాయి. మండలంలో ఇలాంటి పలు సంఘటనలు ప్రతి రోజు చోటు చేసుకున్నాయి. గతంలో పలువురు తహసీల్దార్‌లపై సైతం సస్పెన్షన్ వేటు పడిన అధికారుల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. పలువురు అధికారులు ఏసీబీలకు సైతం పట్టుబడ్డారు. అయినా అధికారుల్లో ఏ మాత్రం భయం లేకుండా అక్రమార్జనే ధ్యేయంగా చలామణి అవుతున్నారు. ఇలాంటి వ్యవహారాలన్నీ ఉన్నతాధి కారుల కనుసనల్లోనే జరుగుతున్నట్లు బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పేరుకే తహసీల్దార్లు..

గత అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక తహసీల్దారులను స్థానచలనం కల్పిస్తూ వేరే జిల్లాలకు బదిలీ చేశారు. అప్పటినుండి రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను డిప్యూటీ తహసీల్దార్లకు అప్పగించారు. ప్రస్తుతం ఎన్నికలు ముగిసి మూడు నెలలు గడుస్తున్న నియోజకవర్గంలో తహపసీల్దార్లు రిజిస్ట్రేషన్ల బాధ్యతలు చేపట్టడం లేదు. ఇదే అదునుగా చేసుకొని డిప్యూటీ తహసీల్దార్‌లు అందిన కాడికి దోచుకోవడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా కొంతమంది డిప్యూటీ తహసీల్దారులు బాధితుల నుంచి నేరుగా నగదును తీసుకోకుండా వారి కుటుంబ సభ్యుల ఖాతాలలో జమ చేసుకున్న తర్వాతే భూముల రిజిస్ట్రేషన్‌లను చేస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్కల్, రాయికోడ్, మొగుడంపల్లి మండలాల్లో ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ డిప్యూటీ తహసీల్దార్లు చేపడుతున్నారు. కోహిర్ మండలంలో సైతం మొన్నటి వరకు డిప్యూటీ తహసిల్దార్ రిజిస్ట్రేషన్ కొనసాగించారు. గత నాలుగు రోజుల క్రితం తహసీల్దార్ రిజిస్ట్రేషన్స్ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వాస్తవానికి తహసీల్దారులే చేపట్టాల్సి ఉన్నప్పటికీ కేవలం వారు పేరుకు మాత్రమే తహసీల్దారులుగా బాధ్యతలు చేపడుతున్నారు. ఇదెక్కడి విచిత్రం? అంటూ రైతులు, బాధితులు విమర్శిస్తున్నారు. ప్రోటోకాల్కే పరిమితం కావడం, ప్రత్యేక అధికారులుగా నియమించడం లాంటి ప్రత్యేక బాధ్యతలు అప్పగించడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సజావుగా సాగడం లేదు. దాంతో రెవెన్యూ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూడాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

ఒక్కో రిజిస్ట్రేషన్‌కు ఒక్కో ధర..

భూముల రిజిస్ట్రేషన్స్ కు సంబంధించి కొనుగోలు /అమ్మకాలు, గిఫ్ట్ డీడ్, పౌతి, మార్టేజ్, చేసుకునేందుకు మీసేవ కేంద్రాల్లో గాని, ధరణి సిటిజన్ పోర్టల్లో గాని ముందుగా స్లాట్ బుక్ చేసిన తర్వాత ఒక తేదీని ఇవ్వడం జరుగుతుంది. అందుకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం ఆన్లైన్లో చెల్లిస్తు న్నారు. కానీ డిప్యూటీ తహసీల్దారులు ఒక్కో డాక్యుమెంటుకు ఒక్కో ధర నిర్ణయించి అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. పాసు బుక్కు డిజిటల్ సంతకం పెండింగ్, రికార్డు మార్పులు, చేర్పులు లాంటి ఫైళ్ళకు తహసిల్దార్ నుండి కలెక్టరేట్ వరకు అన్ని తామే చూసు కుంటామంటూ రెవెన్యూ అధికారులు నమ్మ పలుకుతున్నారు. ఈ వ్యవహారాలన్నీ ఉన్నతాధికారుల కనుసనల్లోనే జరుగుతున్నాయని బలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి సారించాలని రైతులు, బాధితులు కోరుతున్నారు.



ప్రశాంతంగా 5వ తరగతి కామన్ ఎంట్రన్స్ పరీక్షలు

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాల పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఐదో తరగతి కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ పరీక్షలు ప్రశాంతంగా పూర్తి అయినట్లు పాఠశాల ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. మొత్తం 384 మంది విద్యార్థులకు గాను 354 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు చెప్పారు. పరీక్షలు రాసిన వారిలో 154 మంది బాలికలు, 170 మంది బాలురు ఉన్నారన్నారు. 30 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదన్నారు. పరీక్షలకు హాజరు శాతం 92 ఉన్నట్లు చెప్పారు. మొత్తం మీద ఆదివారం గిరిజన గురుకుల పాఠశాలలో ఐదో తరగతి కామన్ ఎంట్రెన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

నేడు ఎన్ఎంఆర్ శ్రేణుల సమావేశం

నవతెలంగాణ-జిన్నారం

ఉమ్మడి జిన్నారం మండలం ఎన్ఎంఆర్ శ్రేణుల సమావేశాన్ని నేడు(సోమవారం) చిట్కుల్‌లోని నీలం మధు ముదిరాజ్ ఫామ్ హౌస్‌లో నిర్వహించనున్నట్టు నారబోయిన శ్రీనివాస్ తెలిపారు. పెద్ద ఎత్తున ఎన్ఎంఆర్ శ్రేణులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.



మూడ్రోజుల పాటు హనుమాన్ మందిర పున:నిర్మాణ వేడుకలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని న్యామతాబాద్‌లో హనుమాన్ మందిరం పున:నిర్మాణంలో భాగంగా శిఖర ధ్వజస్తంభ ప్రతిష్టాపన వేడుకలు నేటి నుంచి మూడ్రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి.న్యామతబాద్ విశ్వనందగిరి మహారాజ్, సిద్దలింగేశ్వర మహరాజ్ పర్యవేక్షణలో శిఖర ప్రతిష్టాపన వైభవంగా చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. నేడు గణపతి పూజ, అగ్ని ప్రతిష్ట, గణపతి హెూమం, 13న అవాహిత దేవత పూజలు , మహా మంగళ హారతి, 14న సర్వమత దేవత హెూమం, అభిషేకం యంత్ర ప్రతిష్ట, ధ్వజస్తంభ శిఖర ప్రతిష్టాపన మహెూత్సవ కార్యక్రమం జరగనున్నది. కాగా ఈ వేడుకల్లో చివరి రోజున వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు విచ్చేస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. నిత్యం అన్నదాన ప్రసాదం, రాత్రి భజన కీర్తనల కోసం ఏర్పాటు పూర్తి చేసినట్టు చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రధాన ధ్యేయం

- విద్యా, వైద్యం అందరికీ అందించడమే లక్ష్యంగా ముందుకు
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



నవతెలంగాణ-మునిపలి

అందరికీ సంక్షేమం, అభివృద్ధి, విద్య, వైద్యం అందించడమే ప్రధాన ధ్యేయంగా తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోద రాజనర్సింహ అన్నారు. తాము ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి తీరుతామన్నారు. ఆందోల్ నియోజకవర్గం మునిపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం మునిపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను, బాలికల హాస్టల్‌ను సందర్శించి పరిశీలించారు. మోడల్ స్కూల్ విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. అక్కడి సౌకర్యాల గురించి ఆరా తీశారు. మోడల్ స్కూల్‌లో తరగతి గదులను, బాలికల హాస్టల్‌లో గదులను, కిచెన్, వసతి సౌకర్యాలను మంత్రి పరిశీలించారు. అనంతరం రూ.64.50 లక్షలతో మోడల్ స్కూల్ భవన మరమ్మత్తులు, రూ.60 లక్షల తో చేపట్టనున్న బాలికల హాస్టల్ భవన మిగులు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్య వ్యవస్థను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. ముఖ్యంగా బాలికల చదువుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి, పిల్లల చదువు , ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టాలన్నారు. మునిపల్లి మోడల్ స్కూల్‌ను గతంలో తాను ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించడం జరిగిందన్నారు. మోడల్ స్కూల్‌ను మరింత అభివృద్ధి చేయడానికి, బాలికల హాస్టల్‌లో అవసరమైన మౌలిక సదుపా యాలు కల్పనకు రూ.85 లక్షల అదనపు నిధులను ప్రకటించారు. సంబంధిత అంచనా ప్రతిపాదనలను పంపి వెంటనే మంజూరు తీసుకొని, పనులు ప్రారంభించాలని టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ ఈఈకి ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే ఆయా పనులు పూర్తిచేసి, విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. అనంతరం మునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంత్రి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండటంతో పాత భవనాన్ని పూర్తిగా తొలగించి, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి కావలసిన అంచనా ప్రతిపాదనలు ఇవ్వాలని, రూ.4.50 కోట్లు నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. అనంతరం మునిపల్లి మండలం బుదేరా జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు వరకు, ఎన్‌హెచ్ - 65 నుంచి ఆర్ అండ్ బి గెస్ట్ వరకు రూ.60 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రెసిడెన్షియల్ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని పూర్తి సర్వే చేయించి, బౌండరీలు ఫిక్స్ చేయాలని, రిపేర్లు అదనపు గదుల నిర్మాణం, కాంపౌండ్ వాల్ , గేటుకు ఏర్పాటుకు, క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన అంచనా ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని మంత్రి సంబం ధిత అధికారులకు సూచించారు. కంకోల్ గ్రామంలో రూ.2.50 కోట్ల నిధులతో కొత్తగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేశారు. పిహెచ్సి ఏర్పాటుతో ఈ ప్రాంత 16 గ్రామాల ప్రజలకు సేవలందుతాయన్నారు. వచ్చే దసరాలోగా పీహెచ్ నిర్మాణ పనులు పూర్తి చేసి, డాక్టర్లు నర్సులు, స్టాఫ్ ను ఏర్పాటు చేసుకుందామన్నారు. ప్రభుత్వం చేసిన వాగ్దానాల అమలుకు కట్టుబడి ఉందన్నారు. పెద్ద చెల్మెడలో రూ.4.35 కోట్లతో నిర్మించనున్న జడ్పీహెచ్ఎస్ కొత్త భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో రూ.37 లక్షలతో చేపట్టనున్న బాత్రుమ్స్, పైప్ లైన్,సెప్టిక్ ట్యాంక్ మరమ్మత్తుల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ సీఈవో సిహెచ్ ఎల్లయ్య, డిఇఓ వెంకటేశ్వర్లు, టీఎస్ఈ డబ్ల్యూఐడీసీ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డిఓ రవీందర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ గాయత్రి దేవి, తహసీల్దార్ తెన్‌మొళి, ఎంపీడీవో హరి నందన్ రావు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు
- దేశవ్యాప్త సమ్మె, బంద్‌ను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఆశా వర్కర్స్‌కు రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం జరిగిన ఆశా వర్కర్స్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త బంద్, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ పదేండ్ల పాలనలో స్కీం వర్కర్లుగా ఉన్న ఆశాల ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదన్నారు. ఆశా వర్కర్లు గత 18ఏండ్ల నుంచి పేద ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. గతం కంటే పనిగంటలు, పని భారం పెరిగిందని అయినప్పటికీ.. వారికి పారితోషకం తప్పా కనీస వేతనం నిర్ణయించలే దన్నారు. ప్రస్తుతం రూ.9750 వేతనం మాత్రమే వారికి ఇస్తున్నారని.. దాంతో కుటుంబం ఎలా గడుస్తుందని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, అప్పటివరకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆశాలకు కేవలం రూ.3000 మాత్రమే చెల్లిస్తుందని, జరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26000 ఇవ్వా లని, ఈఎస్ఐ, పిఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని హెచ్ఎం స్కీంకు 60శాతం బడ్జెట్ తగ్గించి నిర్వీర్యం చేస్తున్నదని.. ఇది సరికాదన్నారు. బడ్జెట్‌లో నిధులు పెంచాలని కోరారు. ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై జరిగే దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, ఆశ యూనియన్ నాయకులు యశోద, వీరమని, ప్రశాంతి, గంగా, వైష్ణవి, సావిత్రి, సంగీత, తుల్జమ్మ, మనీలా, విమల, హైమావతి, విజయలక్ష్మి ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

బార్ల నుంచి బెల్టు షాపులకు మద్యం..

- ఆటోల్లో మద్యం కాటన్‌ల సరఫరా
- నిబంధనలు బేఖతార్



నవతెలంగాణ-జోగిపేట

నిబంధనలకు విరుద్ధంగా జోగిపేటలోనీ బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. వాస్తవానికి బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం ప్రియులకు అక్కడే మద్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ జోగిపేటలో మాతం అందుకు విరుద్ధంగా.. బార్ అండ్ రెస్టారెంట్ నుంచి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు మద్యాన్ని సరఫరా చేస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నిబంధనలకు పాతరేస్తున్నారు. బెల్టుషాపులకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తూ సోమ్ము చేసుకుంటున్నారు. బార్ నుంచి రోజుకు కాటన్‌లలో మద్యాన్ని ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో సరఫరా చేస్తున్నారు. జోగిపేటలోని ప్రధాన ర హదా రిపై ఈ తంతు రోజూ జరుగుతూనే ఉంది. బార్ షాపు నుంచి మద్యం తీసుకెళ్లాలంటే బార్ నిర్వహకులు బాటిల్ మూతను ఓపెన్ చేసి ఇవ్వాలన్న నిబంధన ఉండగా, అవేవి పట్టించుకోకుండా ప్యాక్ చేసిన కాటన్‌లలో మద్యం బాటిళ్లను బెల్టు షాపులకు తరలిస్తున్నారు. ఒకవైపు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గ్రామాల్లో బెల్ట్ షాపు లు నిర్వహించొద్దని ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విష యం విధితమే. కాబట్టి బార్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు బార్ అండ్ రెస్టారెంట్ చేస్తున్న సరఫరా పై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఉంది. బెల్టు షాపు యజమానులకు బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు అండగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో పోలీ సులు కూడా తగుచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దారి దోపిడీ ముఠా అరెస్ట్

- ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు, వృద్ధులే టార్గెట్
- వృద్ధ మహిళ వద్ద బంగారు గుండ్లు లాక్కొని పారిపోయిన దుండగులు
- తులమున్నర బంగారు గుండ్లు, ఆటో స్వాధీనం
- అమీన్‌పూర్,చందానగర్‌కు చెందిన పాత నేరస్తులుగా గుర్తింపు



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు, వృద్ధులే టార్గెట్ చేసుకొని దోపిడీలు చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఈనెల మూడున మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇస్నాపూర్ చౌరస్తా వద్ద వడ్ల మానెమ్మ (60) పాశమైలారం వెళ్లేందుకు నిల్చొని ఉన్నది. ఈ క్రమంలో ఆటోలో ఇద్దరు ఓ మహిళలతో కలిసి ప్యాసింజర్లుగా నటించి, తమ ఆటోలో వడ్ల మానెమ్మను ఎక్కించుకొని అక్కడినుంచి ముత్తంగి ఓఆర్ఆర్ సర్వీసు రోడ్ బ్రిడ్జి పైకి తీసికెళ్లి ఆమె మెడలోని గుండ్లను తెంపుకొని, ఆమెను అక్కడే దించి ఆటోతో పాటు పారిపోయారు. కేసు నమోదు చేసిన పటాన్‌చెరు సీఐ శ్రీనివాస్‌రెడ్డి.. మూడు టీములతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం 12.30 గంటల ప్రాంతంలో పట్టణంలోని టోల్‌గేట్ వద్ద నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుండి మానెమ్మ వద్ద దొంగిలించిన 28 బంగారు గుండ్లు, 8 బంగారు ర్యాకలు, 1 బంగారు చింతాగింజ లను స్వాధీనం చేసుకుని, నిందితులు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వారు గతంలో కూడా పలు నేరాల్లో రాంచంద్రాపురం, చందా నగర్, మియాపూర్ ఏరియాలలో గతంలో పలు దొంగతనాలు చేసి జైలుకు వెళ్ళినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసులను పటాన్ చెరు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి అభినందించారు.

శిఖం భూముల కబ్జా..

- ఆవేదన వ్యక్తం చేస్తున్న గొల్లకుంట రైతులు



నవతెలంగాణ-జిన్నారం

కొందరు అక్రమార్కులు శిఖం భూముల కబ్జాలకు పాల్పడుతు న్నారంటూ జిన్నారం మండలం గొడవపంచి గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లకుంట రైతులు, మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొడకంచి శివారులోని 216 సర్వే నెంబర్‌కు చెందిన గొల్లకుంటకు సంబంధించిన ఐదెకరాల 32 గుంటలు శిఖం భూముల్లో కొందరు అక్రమార్కులు కన్నేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా కుంట శిఖం పరిధి తగ్గడంతో ఇటు వ్యవసాయ రైతులకు, అటు మత్స్యకారులకు, పశువుల నీటి అవసరాలకు భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వారు వాపోయారు. ఈ నేపథ్యంలోనే కొడకంచి గ్రామానికి చెందిన నాగరాజు బృందం ఇటీవలే ఇరిగేషన్ అధికారులు డీఈఈ రామస్వామి, ఏఈ దిలీప్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదులు చేసినట్టు చెప్పారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు మాత్రం తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపు కుంటున్నారంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయి స్థితిగతులను లోతుగా పరిశీలించి అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకుని కుంట శిఖం భూములను పరిరక్షిస్తూ మత్స్యకారులకు, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-జహీరాబాద్

ఈనెల 15వ తేదీన జరిగే సేవలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని స్థానిక ఎమ్మెల్యే మాణిక్‌రావును ఆహ్వానించినట్టు ఉత్సవ కమిటీ చైర్మెన్ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించినట్టు చెప్పారు. కాగా ఈ ఉత్సవాల్లో తప్పక పాల్గొంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సింగ్,రామ్ రాథోడ్, శ్రీనివాస్ నాయక్, వాసు నాయక్, సంజు పవార్,విజయ్ రాథోడ్, రాజు బనోత్, రవీందర్ చౌహాన్ పాల్గొన్నారు.

వివాహ, వస్త్రధారణ, నామకరణ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మండలంలోని వెంకటాపూర్ బీఆర్ఎస్ నాయకుడు మల్గొండ తమ్ముడి కుమారుని నామకరణ వేడుకల్లో, సత్యగామ గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి వివావ వేడుకల్లో, నందురావు నూతన వస్త్ర వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. వారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకన్న, ఖేడ్ పట్టణ అధ్యక్షులు నగేష్ సెట్, ఆత్మ డైరెక్టర్ ర్యకాల గోపాల్, కల్హేర్ మండల పార్టీ యువత అధ్యక్షులు సంతోష్ కుమార్ యువ నాయకులు జైపాల్,అబ్బు, రమేష్ నాయక్ తదితరులు ఉన్నారు.



స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం పరిశుద్ధ సిలువగుట జాతరలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జాతరకు విచ్చేసిన ప్రజలకు వైద్య పరీక్షలు చేసి వైద్య సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్థోపెటిక్ డాక్టర్ నరేష్ యాదవ్, హాస్పిటల్ సీఈవో డాక్టర్ హరి రాథోడ్,హాస్పిటల్స్ సిబ్బంది మోహన్ లాల్, డాక్టర్ శ్రీకాంత్, నర్సింగ్‌స్టాఫ్ సోనీ, సారిక,లావణ్య,నాగమణి పాల్గొన్నారు.



కుస్తీపోటీల్లో సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

నవతెలంగాణ-కంగ్టి

వరంగల్లో జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలో కంగ్టి గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో అండర్ 30 విభాగంలో దేనిష్‌కుమార్, బాలాజీ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పథకం సాధించారు. అండర్-15 విభాగంలో శివాజీ మూడో స్థానంలో నిలిచి కాంస్య పథకం కైవసం చేసుకున్నారు. పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావ్, వైస్ ప్రిన్సిపాల్ సంగీత, పీడీ మహేష్, పీటీ విష్ణు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజాకర్షణ బడ్జెట్



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్ ప్రజాకర్షణగా ఉన్నదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ బడ్జెట్‌లో అన్ని రంగాలకు నిధులను కేటాయి ంచారని సంతోషం వ్యక్తం చేశారు. పేదలకు అనుకూలంగా బడ్జెట్ ఉన్నదని.. ఇందిరమ్మ గృహాలను ప్రతి నియోజకవర్గానికి కేటాయిం చడం సంతోషకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని, అభివృద్ధి సంక్షేమానికి సమపాళ్లలో నిధులు కేటాయించడం చూస్తే తెలంగాణపై ఎంత అనుభవం వుందో అర్థమైతున్నదని వెల్లడించారు.



ముదిరాజ్ సంఘం ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జహీరాబాద్

తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ గవర్నమెంట్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ చేసినట్లు జహీరాబాద్ తాలూకా ముదిరాజ్ సంఘం బరువు దత్తాత్రే తెలిపారు. ఆదివారం స్థానిక ముదిరాజ్ సంఘం కార్యాలయం నందు జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సంగొప్ప ముదిరాజ్, గోపాల్ ముదిరాజ్,ప్రదీప్ ముదిరాజ్, సురేందర్ ముదిరాజ్, శ్రీశైలం ముదిరాజ్, దత్తాత్రి ముదిరాజ్, మచ్చెందర్ ముదిరాజ్, రాజు, నర్సింహ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, గోపాల్ పాల్గొన్నారు



19న మహాపడి పూజను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కంగ్టి

మండల పరిధిలోని చాప్టా(కె)గ్రామంలో ఫిబ్రవరి 19న శివ దీక్ష స్వాములు చేస్తున్న మహాపడి పూజను విజయవంతం చేయాలని గ్రామ సన్నిధానం స్వాములు కోరారు. జానవాడే ఉమాకాంత్ స్వామి ఇంట్లో మధ్యాహ్నం 12గంటలకు ఈ పూజ కార్యక్రమం ఉంటుందని గురు స్వామి కొండ సాయిలు తెలిపారు. అదేవిధంగా ఈనెల 26న శివ దీక్ష స్వాములందరూ కలిసి స్థానిక హనుమాన్ మందిరంలో మహాపడి పూజ కార్యాక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని.. కావున మండల పరిధిలోని శివ స్వాములతో పాటు వివిధ మండలాలు,నియోజకవర్గం, జిల్లాలో ఉన్న స్వాములందరు అధిక సంఖ్యలో వచ్చి మహాపడి పూజను విజయవంతం చేయాలన్నారు.



కురుమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంగ్టి

మండలంలోని తడ్కల్‌లోని వాగ్దేవి పాఠశాలలో కురుమ సంఘం క్యాలెండర్‌ను కురుమ సంఘం మండలాధ్యక్షులు హుల్గొండ, పాఠశాల ప్రిన్సిపాల్ దత్తు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కురుమలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే చదువుతో పాటు అన్ని రంగాలో చైతన్య వంతులు కావాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా చైతన్యం అయినప్పుడే తమవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మనసాక్షి రిపోర్టర్ రస్తుం జలీల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జిన్నారంలో రాజకీయ రసవత్తరం

- ఎంపీపీ పీఠమే లక్ష్యంగా అధికార, ప్రతిపక్షాల ఎత్తుగడ
- ఇటీవలే ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం..



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలంలో రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. ఎంపీపీ పీఠమే ప్రధాన లక్ష్యంగా రోజు రోజుకు రాజకీయ ఎత్తుగడలు కొనసాగుతున్నాయి. ఇటీవలే కాంగ్రెస్ ఎంపీపీపై బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం పెట్టిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఎంపీపీ పీఠాన్ని దక్కిఉంచుకోవాలని అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పావులు కదుపుతున్నాయి. ప్రస్తుతానికి బీఆర్ఎస్‌కు మెజార్టీ ఉన్నప్పటికీ.. చివరి క్షణం వరకు ఎవరి ఏ పక్క నిలుస్తారో ఉత్కంఠ నెలకొన్నది.

జిన్నారం మండల పరిషత్తు ఎన్నికల్లో 8 ప్రాదేశిక నియోజకవర్గం స్థానాలకు నాలుగున్నర ఏండ్ల కిందట జరిగిన పోటీలో.. బీఆర్ఎస్ నాలుగు స్థానాలు, కాంగ్రెస్ నాలుగు స్థానాలు గెలుచుకుని సమ ఉజ్జీలుగా నిలిచాయి. దాంతో ఎంపీపీ పీఠానికి సంబంధించి డ్రా పద్ధతిని వేయగా.. కాంగ్రెస్ పార్టీ నుంచి వావిలాల ఎంపీటీసీ ఉన్న దమ్మగౌని రవీందర్ గౌడ్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఊట్ల ఎంపీటీసీ గంగు రమేష్‌కు జిన్నారం ఎంపీపీ ఉపాధ్యక్ష పదవి దక్కింది. అయితే నాలుగున్నర ఏండ్ల తర్వాత ప్రస్తుతం జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్‌పై బీఆర్ఎస్ ఎంపీటసీలు అవిశ్వాసానికి తెరతీశారు. ఈ నేపథ్యంలోనే ఫిబ్రవరి 2న సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్ రెడ్డికి అవిశ్వాసం పెట్టాలంటూ ప్రత్యేకంగా ఫిర్యాదు చేశారు. అయితే నాడు ఎంపీటీసీ స్థానాల్లో సమఉజ్జీలుగా ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల పరిణామాలు తీవ్రంగా కుదిపేశాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పక్షానికి చెందిన కాజిపల్లి మాదారం ఎంపీటీసీ ఆకుల భార్గవ్, జిన్నారం ఎంపీపీ ఉపాధ్యక్షులు గంగు రమేష్‌లు బీఆర్ఎస్ గూటికి చేరారు. ఫలితంగా ఎంపీటీసీ స్థానాల్లో బీఆర్ఎస్‌కు బలం పెరిగింది. జిన్నారం ఎంపీటీసీ-2 వెంకటేశం గౌడ్, శివానగర్ ఎంపీటీసీ బత్తుల సంతోష, సోలక్ పల్లి ఎంపీటీసీ ఎలిమెల స్వాతి, కాజిపల్లి మాదారం ఎంపీటీసీ ఆకుల భార్గవ్, జిన్నారం ఎంపీపీ ఉపాధ్యక్షులు ఊట్ల ఎంపీటీసీ గంగు రమేష్‌లు బీఆర్ఎస్ దళంగా అయిదుగురి మద్దతుతో రాజకీయ వ్యూహాలకు బీఆర్ఎస్ పదును పెట్టింది. ప్రస్తుతం ఎంపీపీ అధ్యక్షులుగా ఉన్న దమ్మ గౌని రవీందర్ గౌడ్(వావిలాల ఎంపీటీసీ), గడ్డపోతారం ఎంపీటీసీ జానాబాయి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ గూటికి చేరిన జిన్నారం ఎంపీటీసీ-వన్ కోరబోయిన లావణ్యలు కాంగ్రెస్ పక్షంగా పదునైన వ్యూహ ప్రతి వ్యూహాలతో రాజకీయ చతురంగ వ్యూహాలలో తలమునకలైంది. అయితే ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు క్లియర్ కట్‌గా మెజార్టీ కనిపిస్తున్నా.. తీర్మాన సమావేశం లోపు పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేమని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు.

విజయం ధర్మం వైపే



విజయం ఎప్పుడూ ధర్మం వైపే ఉంటుంది. ధర్మబద్ధంగా ఎంపీపీ పీఠాన్ని అమ్మవారి అదృష్టంతో డ్రా పద్ధతిలో నాడు అధిరోహించాను. ప్రజా పాలనలో నీతి నిజాయితీగా రాజకీయాలకతీతంగా ప్రజా సేవే పరమావధిగా ముందుకు సాగాను. అవిశ్వాస ఫిర్యాదులు ఏవైనా ధర్మం విజయం సాధిస్తుంది. అధికారం కోసం కొందరు తొందరపడుతున్నారు.

– రవీందర్ గౌడ్, ఎంపీపీ



మసీద్ ప్రారంభోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని మూసనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన మస్జిద్-ఈ-రుఖయ్య ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, శాసనసభ్యులు కోనింటి మాణిక్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం, టీఎస్ఐడీసీ మాజీ చైర్మెన్ మొహమ్మద్ తన్వీర్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు మెంబర్ షేక్ ఫరీద్, మాజీ ఆత్మ చైర్మెన్ రామకృష్ణ రెడ్డి, సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్‌లు, మాజీ కౌన్సిలర్‌లు, పార్టీ మండలాధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన దుకాణ ప్రారంభోత్సవంలో కృష్ణారెడ్డి



నవతెలంగాణ-ఐడీబొల్లారం

బొల్లారం మున్సిపల్ ప్రాంతంలో బొల్లారానికి చెందిన హకీం భాయ్ నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యాషన్ పాయింట్ చెప్పులు షాపును కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడు తూ.. వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించాలని తద్వారా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం షాపు నిర్వాహకులు ఆనంద్ కృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మండలంలోని పోతన్‌పల్లి అండ్ మాదవ్వార్ గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే సంజీవర్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. అలాగే హైమాక్స్ లైట్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేద ప్రజలకు సంక్షేమం కోసం గృహలక్ష్మి, ఉచిత కరెంట్, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీలో పది లక్షల వరకు బీమా పెంపు లాంటి ఎన్నో బృహత్కర పథకాలు అమలు చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మండలం నాయకులు ఎంపీటీసీ నగేష్, సంగయ్య ఉపసర్పంచ్, ఎంపీపీ తనయుడు రమేష్ చౌహన్, కిష్టాగౌడ్ మాజీ సర్పంచ్, మారుతీ, దస్త గౌడ్, అల్లభక్షి, పెంటన్న, శ్రీనివాస్, కారక్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టాపనలో మాజీ ఎమ్మెల్యే





నవతెలంగాణ-కల్హేర్

సిర్గాపూర్ మండలంలోని చిన్నముబారక్‌పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామ మందిరం శ్రీరామ చంద్ర మూర్తి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్ రెడ్డి, సాయిలు, రవి, శ్రీను, గ్రామస్తులు ప్రజలు పాల్గొన్నారు.

నూతన హార్వెస్టర్ ప్రారంభం..

కల్హేర్ మండలంలోని ఇంద్రానగర్ ఖానాపూర్ తాండాకు చెందిన బిలే నాయక్ నూతన వరికోత మిషన్(హార్వెస్టర్)ను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి టెంకాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం వరి కోత మిషన్‌ను ఆయన సొంతంగా కొంతదూరం డ్రైవ్ చేశారు. తర్వాత బిలే నాయక్‌కు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నరసింహారెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు రాంసింగ్, సర్పంచ్ కిష్టారెడ్డి, మండల సోషల్ మీడియా అధ్యక్షులు ప్రశాంత్‌సాగర్, ఇంద్రనగర్ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో చీడపీడల నివారణ



నవతెలంగాణ-వట్‌పల్లి

మొక్కజొన్న, తెల్లజొన్న కూరగాయలను ఆశిస్తున్న చీడపీడ పురుగులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హైదరాబాదులోని వ్యవసాయ పాలిటెక్నిక్ విశ్వవిద్యాలయం రావెపె విద్యార్థులు వట్‌ల్లిలోని రైతు పొలంలో ప్రయోగాత్మకంగా రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. కూరగాయలు, మొక్కజొన్నలు నీటితడి పంటలైన టమాట, వంకాయ తదితర పంటల్లో పూత దశలో పురుగు ఆశించి కాండాన్ని కొరకడంతో పూతరాకుండా చెట్టుగానే మిగిలిపోతుందన్నారు. దాంతో రైతు పూత దశలో ఉన్న పంటలను రక్షించుకునేందుకు లింగాకర్షక బుట్టాలను ఒక ఎకరానికి ఎనిమిది చొప్పున అమర్చుకోవాలన్నారు. తద్వారా ఆ చీడపీడ పురుగులను నివారించవ చ్చన్నారు. సాయంత్రం, తెల్లవారుజామున సంచరిస్తున్న పురుగులను లింగాకర్షక బుట్టలు ఆకర్షించుకోవడంతో వాటి రెక్కలు విరుగుడు పడతా యంన్నారు. టార్ వల్ల మగ రెక్కల పురుగుల నివారణ తగ్గుతుందన్నారు. రైతులు పంటలపై నిత్యం పరిశోధన చేయడంతోపాటు మొక్కలపై పురుగుల ఉధృతిని పరిశీలించాలన్నారు. లింగకర్షణ బుట్టల ద్వారా పురుగుల నివారణ కాకపోతే వ్యవసాయ అధికారులను సంప్రదించి పిచికారు మందులను ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం సంగుపేటకు, రాజేంద్రనగర్ చెందిన రావేపె విద్యార్థులు అమన్, శివ, వికాస్, ప్రశాంత్, మోహన్, సంతోష్, రైతులు మల్లారెడ్డి, అమృత రెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి చెందాలని జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని కేబీఆర్ కాలనీలో రవి నూతనంగా ఏర్పాటు చేసిన టైలర్ షాపును ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియో గదారులకు నాణ్యమైన సేవలను అందించాలని తద్వారా వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు బాల్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బీరప్ప యాదవ్, విజయ్‌రెడ్డి, కాంతారావు, టీచర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నామకరణ మహెూత్సవంలో పాల్గొన్న చంద్రశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గం తోరణాల గ్రామంలో ఆదివారం జరిగిన అంబోజి కుమారుడి నామకరణ మహెూత్సవంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుడిని ఆశీర్వదించి.. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోరిపోర్టర్ అరుణ్, సంగారెడ్డి, అశోక్‌రావు పాటిల్, సంతోష్‌రెడ్డి, ప్రకాష్,సంతోష్, నర్సింలు పాల్గొన్నారు.

శుభకార్యాల్లోనూ రాజకీయ చర్చ..



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలో ఆదివారం జరిగిన పలు శుభకార్యాలు, గృహప్రవేశాల్లో ఎంపీ బీబీ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే జహీరాబాద్ పట్టణంలోని సామాజిక కార్యకర్త మహమ్మద్ పాషా మియా నూతన గృహ ప్రవేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ ఎమ్మెల్యే మాణిక్యరావు, టీఎస్ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్‌లతో కలిసి ఎంపీ మాట్లాడుతూ.. త్వరలోనే పార్లమెంట్ ఎన్నికలు రానున్నాయని.. చివరి సమావేశాలు కూడా ముగిసాయన్నారు. జహీరాబాద్ అభ్యర్థిగా బీఆర్ఎస్ అధిష్టానం మూడోసరి కూడా తనకే అవకాశం ఇస్తుందన్నారు. కార్యకర్తలు అందరూ కలిసి సమన్వయంతో భారీ మెజారిటీ తీసుకువచ్చేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా అత్యాధునిక హంగులతో నుతన గృహాన్ని నిర్మించుకొని గృహ ప్రవేశం చేస్తున్న మొహమ్మద్ పాషాను ఎంపీ బిబి పాటిల్, ఎమ్మెల్యే మణిక్ రావు శాలువాకప్పి బొకేతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ కౌన్సిలర్ మోతిరామ్ కూతురు వివాహంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖిజర్ యఫై, డీఆర్‌యూసీసీ మేంబర్ షేక్ ఫరిద్, గుంజేటి ఎంపీటీసీ దేశెట్టి పాటిల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రామకృష్ణ రెడ్డి, సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, మొహమ్మద్ అబ్దుల్ మూర్తుజ, బండి మోహన్, మొహమ్మద్ నవీద్, గోవర్ధన్ రెడ్డి, యువజన బీఆర్ఎస్ నాయకులు అక్షయ్ దేశ్పాండే, బిజీ సందీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూన గంగమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 108 సిబ్బందికి సన్మానం



నవతెలంగాణ-కల్హేర్

అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడుతున్న 108 ఎమర్జెన్సీ సిబ్బంది కనిపించే దేవుళ్ళతో సమానమని కూన గంగమ్మ ఫౌండేషన్ సంస్థ చైర్మన్, అడ్వకేట్, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కూన వేణు గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక ఫౌండేషన్ కార్యాలయంలో 108 సిబ్బందిని శాలువాలతో సన్మానించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 18 ఏండ్లుగా 108 సిబ్బంది అలుపెరుగని సేవ చేస్తున్నారని కొనియాడారు. రాత్రి పగలు తేడా లేకుండా వారు సేవలందిస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 108 సిబ్బంది సేవలను గుర్తించి.. వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ ఈఎంటి చిరంజీవి మాట్లాడుతూ.. 108 ఎమర్జెన్సీ సర్వీస్ ప్రారంభించిన నాటినుండి ప్రభుత్వమే వందశాతం నిధులు ప్రైవేటు యాజమాన్యానికి చెల్లిస్తున్నదని.. కాబట్టి 108 ఎమర్జెన్సీ సర్వీసును ప్రభుత్వంలో విలీనం చేసి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించా లన్నారు. తమకు కనీస వేతనాలు అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు, గంగమ్మ ఫౌండేషన్ సభ్యులు, 108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం నుంచి తొలగించాలి

- లేని యెడల విధులు బహిష్కరిస్తాం
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి



నవతెలంగాణ-సంగారెడ్డి

శానిటరీ ఇన్స్పెక్టర్ విజయబాబును ఉద్యోగం నుంచి తొలగించకపోతే విధులు బహిష్కరిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాల పేరు మీద సానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయబాబు అక్రమాలకు పాల్పడుతున్నాడని.. కొంతమంది కార్మికులను తొలగించి వారి స్థానంలో తన కుటుంబ సభ్యులతో భర్తీ చేస్తున్నారని ఆరోపించారు. ఇంటి దగ్గరికి పనికి రమ్మని కార్మికులను ఇబ్బంది పెడుతూ.. నువ్వు పనికి రాకపోతే నీ సంగతి చూస్తానని బెదిరిస్తున్నాడన్నారు. అలాంటి సానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయబాబును ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. ఇన్ని తప్పులు చేస్తున్నా మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం చాలా దారుణమ న్నారు. తొలగించిన కార్మికులను విధులకు తీసుకోవాలని, అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయబాబుని ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. లేని యెడల విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తారాసింగ్, పుండరీకం, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మతాలకతీతంగా దళితులు ఐక్యం కావాలి



నవతెలంగాణ-జహీరాబాద్

మత విశ్వాసాలకు అతీతంగా దళితులు ఐక్యం కావాలని దళిత సాలిడారిటీ మూవ్ మెంట్ అధ్యక్షుడు వలిగొండ విజయరాజు పిలుపునిచ్చారు. జహీరాబాద్ పట్టణంలోని స్థానిక కార్యాలయంలో డీఎస్ఎం(ఇండియా) జిల్లా కమిటీ ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా బీజేపీ పనిచేస్తున్నదని.. అందుకు ఆ పార్టీ నాయకుడు సుబ్రమణ్య స్వామి రాజ్యాంగం నుంచి సెక్యులర్, సామ్యవాద పదాలను తొలగించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించడమే నిదర్శనమన్నారు. సెక్యులరిజం రద్దుతో ఈ దేశంలో ఒకే మతం ఉండేలా కుట్ర చేస్తున్నారని.. సామ్యవాదాన్ని వ్యతిరేకిస్తున్న పెట్టుబడిదారులకు బీజేపీ వత్తాసు పలుకుతున్నదని ఆరోపించారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ వర్తించకుండా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అన్యాయం చేశాయని, ఇప్పటికైనా దళిత క్రైస్తవులు అంబేద్కర్ బాటలో ప్రయాణించి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం డీఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయికోటి నర్సింలు ఆధ్వర్యంలో డీఎస్ఎం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

డీఎస్ఎం సంగారెడ్డి జిల్లా కమిటీ..

జిల్లా అధ్యక్షుడిగా హేమానంద్, ప్రధాన కార్యదర్శిగా చిరంజీవి, ఉపాధ్యక్షులుగా సునీల్, సంజీవులు, కోశాధికారిగా మోహన్ సహాయ కార్య దర్శులుగా ప్రదీప్, సంఘమేశ్ కార్యవర్గ సభ్యులుగా సిద్దన్న, నర్సమ్మ, తిప్పాజి, గౌరవ సలహాదారుగా అయిదాల రాంచందర్‌లను ఎన్నుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
మెదక్
సోమవారం | 12 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కై ప్రత్యేక శిబిరం



నవతెలంగాణ-మనోహరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో బాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పోతరాజ్‌పల్లిలోని విద్యుత్ ఏడీఈ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఈ రాజమల్లేషం మాట్లాడుతూ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కై ఆదార్ కార్డుతో పాటు రేషన్ కార్డు, ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తు రసీదులను తీసుకురావాలని సూచించారు. దాంతో అప్‌డేట్ చేయడం జరుగుతుందని ఏడీఈ తెలిపారు. ఒకే రేషన్ కార్డుకు ఒకటే మీటర్ నంబర్‌కు అప్‌డేట్ అవుతుందని సూచించారు. వినియోగదారులు ఈ ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ రాజమల్లేషం సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఏఈ వరాహలబాబు, సబ్ ఇంజనీర్ నరెందర్‌తో పాటు సిబ్బంది షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-రామాయంపేట : రామాయంపేట పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆదివారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 5వ తరగతి ప్రవేశాలకు కామన్ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించారు. మొత్తం 480 విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్ష జరిగింది.



గోవర్ధన్ రెడ్డి బ్రదర్స్ సేవలు మరువలేనివి

చౌటకూరి గోవర్ధన్ రెడ్డి బ్రదర్స్‌కు డైరీని అందజేసిన పిఆర్టీయు ప్రతినిధులు



నవతెలంగాణ-చిలిపిచేడ్

చౌటకూరి గోవర్ధన్ రెడ్డి బ్రదర్స్ సేవలు మరువలేనివని పిఆర్టియు ఉపాధ్యాయులు కొనియాడారు. ఆదివారం గోవర్ధన్ రెడ్డి స్వగృహంలో మర్యాదపూర్వకంగా పీఆర్‌టీయూ నాయకులు ఆయనను కలిసి పిఆర్టియు డైరీని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రతి ఉపాధ్యాయునికి సన్మాన కార్యక్రమం చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మండలంలో ఎవరు చేయలేని సేవ ప్రతి రంగంలో బడుగు బలహీన వర్గాలకు సేవలు అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గోవర్ధన్ రెడ్డి బ్రదర్స్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయుల సంక్షేమంలో తాము ముందుంటామంటూ చిలిపిచెడ్ మండల విద్యాభివృద్ధిలో సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చౌటకూరి గోవర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్రెడ్డి, గురివి నాయుడు, శ్రీనుబాబు, తులసీరావు, తదితరులు పాల్గొన్నారు.

తోటి కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన సీఐటీయూ నాయకులు



నవతెలంగాణ-మనోహరాబాద్

మృతి చెందిన తోటి కార్మికుడి కుటుంబానికి కార్మికులు ఆర్థిక సహాయాన్ని అందించి తమ ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన జి రమేష్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. కాగా గత వారం రోజుల క్రితం గుర్తు తెలియన వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. కాగా ఆదివారం సీఐటీయూ జిల్లా గ్రామ పంచాయతీ కార్మిక సంఘం కార్యదర్శి ఆసిఫ్ ఆధ్వర్యంలో మండలంలోని 17 మంది గ్రామపంచాయతీ కార్మికులు కలిసి మృతి చెందిన రమేష్ కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారు. అ కార్యక్రమంలో మండలంలోని పారిశుధ్య కార్మికులు వడ్డెపల్లి సత్తయ్య, అర్జున్, భిక్షపతి, దావీద్, శోభ, ఎల్లమ్మ, నవనీత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య హస్టల్ కార్యవర్గ సభ్యునిగా నారాయణగుప్త



నవతెలంగాణ-మనోహరాబాద్

హైదరాబాద్‌లోని ముషీరాబాద్ వాసవి ఆర్యవైశ్య హస్టల్ కార్యవర్గ సభ్యునిగా (ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా) తూప్రాన్ పట్టణానికి చెందిన తూప్రాన్ మున్సిపల్ 16వ వార్డు కౌన్సిలర్, రాష్ట్ర ఐవీఫ్ కోశాధికారి కొడిప్యాక నారాయణగుప్తను నియామకమయ్యారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ గెల్లు రమేష్, వైశ్యరత్న గంజి రాజమౌళిగుప్తలు నారాయణగుప్తకు నియామక పత్రాన్ని అందజేశారు. నూతన కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన నారాయణగుప్తను మాజీ ఎంపీ టీజి వెంకటేష్, ఎమ్మెల్సీ దయానందగుప్త, మాజీ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, మాజీ ముఖ్యమంత్రి రోశయ్య కుమారుడు శివకుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త బండారు సుబ్బారావ్, రమేష్‌గుప్తలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి ఆర్యవైశ్య హస్టల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వాసవి ఆర్య వైశ్య హస్టల్ ఎగ్జికూటివ్ మెంబర్‌గా ఎన్నికైన నారాయణగుప్తను తూప్రాన్ మున్సిపల్ ఆర్యవైశ్య సంఘం నాయకులు జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు అభినందించారు.

రామాయంపేట లైన్స్ క్లబ్ స్నేహబందుకు అవార్డులు

జోన్ చైర్మన్ రవీందర్ గౌడ్



నవతెలంగాణ-రామాయంపేట

రామాయంపేట లైన్స్ క్లబ్ స్నేహ బందు చేసిన సేవలను గుర్తించి, లైన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ అవార్డులు మూడు లభించాయని లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఐరన్ రవీందర్ గౌడ్ తెలిపారు. శనివారం రాత్రి గజ్వేల్ లో జరిగిన లైన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ 320డి లో భాగమైన ఎక్సలెన్స్ రీజియన్ 5 కాన్ఫరెన్స్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ అవార్డులను లైన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు, రీజియన్ చైర్‌పర్సన్ గుడాల రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకోవడం జరిగిందని రవీందర్ గౌడ్ తెలిపారు. తనకు బెస్ట్ జోన్ చైర్మన్ అవార్డు లభించిందని, రామాయంపేట లైన్స్ క్లబ్ స్నేహబందు నుంచి బెస్ట్ డీసీగా ఎం.దీప్ చంద్, కోశాధికారిగా గడ్డం గంగారామ్‌లు ప్రత్యేక బహుమతులు అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసివి దామోదర్ రావు, కే శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-రామాయంపేట

వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రామాయంపేటలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏకాదశ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.



మన ఊరు-మనబడి పనులు ప్రారంభించేది ఎప్పుడు?

- ప్రాథమిక పాఠశాల గదులు కూల్చివేసి 4 నెలలు అవుతున్నప్పటికీ పట్టింపు లేదు
- కాంట్రాక్టర్ పట్టించుకోవడంలేదనే విమర్శలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



నవతెలంగాణ-నిజాంపేట

గత రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా నిజాంపేట ప్రాథమిక పాఠశాలకు గదులను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం రూ.86 లక్షల నిధులను మంజూరు చేసినప్పటికీ, నేటికీ పనులు ప్రారంభించలేదు. శిథిలావస్థలో ఉన్న గదులను కూల్చివేసి దాదాపు నాలుగు నెలలు అవుతున్నప్పటికీ వాటి పనులు ప్రారంభించకపోవడమేమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. దేవుడు కరుణించినా పూజారి కనికరించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు చదువుకోవడానికి గదులు లేక నానా ఇబ్బందులకు గురవుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం నూతన గదులను నిర్మించాలని నిధులను మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన పనులు ప్రారంభించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గదులను కూల్చివేయడంతో ప్రాథమిక పాఠశాలకు రక్షణ లేకుండా పోయిందని బయట నుండి ఎన్నో జంతువులు పశువులు పాఠశాల లోనికి వస్తున్నాయన్నారు. స్కూలు ప్రహరీ గోడ అవతల గ్రామానికి చెందిన మంచినీటి ట్యాంకు, మొక్కలను పెంచే నర్సరీ ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పనులు ప్రారంభించేలా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

- ఫీజు రీయంబర్స్ మెంట్స్, మెస్ ఛార్జీలపై స్పష్టత కరువు
- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జగన్
- మెదక్‌లో ప్ల కార్డ్స్‌తో నిరసన



నవతెలంగాణ-మెదక్

తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జగన్ అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డ్స్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.8 శాతం మాత్రమే కేటాయించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టినట్లు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పినా కేటాయించింది రూ.500 కోట్లు మాత్రమేనని, రూ.500 కోట్లతో ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో యూనివర్శిటీలు దెబ్బతిన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెస్, భవనాలు, ఖాళీల భర్తీ, మౌళిక సదుపాయాలు కల్పిస్తామని ప్రతి యూనివర్శిటీకి అభివృద్ధికి నిధులు ఇస్తామని చెప్పారన్నారు. ఉస్మానియాకు రూ.1000కోట్లు, మహిళ యూనివర్శిటీ అభివృద్ధి కోసం నిధులు, బాసర ఐఐఐటి అభివృద్ధి, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలలో నూతన యూనివర్శిటీలు కోసం కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 11 రాష్ట్ర యూనివర్శిటీలకు కనీసం నిర్వహణకు నిధులురావని, ఒక్క ఉస్మానియా యూనివర్శిటీకే రూ.350 కోట్లు పైగా నిర్వహణకు అవసరమని తెలిపారు. కాకతీయ, మహాత్మాగాంధీ, తెలంగాణ, శాతవాహన, జెఎన్టీయుహెచ్, ఫైన్ ఆర్ట్స్, మహిళా యూనివర్శిటీ, అగ్రికల్చర్ యూనివర్శిటీ, వెటర్నరీ, హార్టీకల్చర్‌లాంటి వాటికి నిధులు కేటాయింపులు లేవన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం బాసర ఐఐఐటిల లాగా మరో రెండు కేటాయిస్తామని చెప్పి వాటి గురించి ప్రస్తావించలేదన్నారు. ఖాళీల భర్తీ, మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, లైబ్రరీ, మూత్రశాలలు, మౌళిక సదుపాయాలు కోసం ఈ నిధులు సరిపోవన్నారు. గురుకులాల నిర్మాణం కోసం రూ1546కోట్లు సరిపోవని, 800 పైగా గురుకూలాలకు స్వంత భవనాలు లేవని, ఉన్న గురుకులాల్లో సరైన మౌళిక సదుపాయాలు లేవన్నారు. గత ఆరేళ్ళ నుంచి స్కాలర్ షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్స్ రూ.7200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటి విడుదల కోసం నిధులు కేటాయించలేదని తెలిపారు. గురుకులాలు, కెజిబివిలు, సంక్షేమ వసతిగృహాలకు గత సంవత్సరం నుంచి మెస్ ఛార్జీలు పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. వాటి నిధులు గురించి ప్రస్తావన లేదన్నారు. ప్రభుత్వం 15 శాతం నిధులు విద్యారంగానికి కేటాయిస్తామని చెప్పి 7.8 శాతం నిధులు మాత్రమే కేటాయించారని తెలిపారు. నిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి అజయ్, నాయకులు కార్తీక్, నవీన్, కృష్ణ వంశీ పాల్గొన్నారు.

యువత ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



నవతెలంగాణ-మనోహరాబాద్

గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా యువత ముందుకు వచ్చారు. గ్రామాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను చేపడుతూ గ్రామాన్ని ఆర్శంగా తీర్చిదిద్దుతున్నారు. తూప్రాన్ మండలంలోని మల్కాపూర్‌లో 401 వారాల పాటు స్వచ్ఛభారత్ చేపడుతుండగా మల్కాపూర్‌ను ఆదర్శంగా తీసుకున్న మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ గత 301 వారాల పాటు స్వచ్ఛభారత్‌ను చేపడుతూ మండలంలోనే ఆదర్శంగా నిలుస్తుంది. కాగా నేచర్ ఐకాన్ చేపడుతున్న కార్యక్రమాలను చూసి తమ గ్రామంలో కూడా స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చేపట్టాలనే లక్ష్యంతో గ్రామ కార్యదర్శి సత్యనారాయణ ప్రోత్సాహంతో పాటు నేచర్ ఐకాన్ యూత్‌ను ఆదర్శంగా తీసుకున్న జీడిపల్లి గ్రామ యువత మొదటి రోజు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ కృష్ణమూర్తితో పాటు కార్యదర్శి సత్యనారాయణతో కలిసి ప్రదాన కూడలి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను యువత చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. గతంలో కూచారం గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహించిన సత్యనారాయణ ప్రోత్సాహంతోనే కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్‌గా తయారై స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చేపడుతూ మండలానికే ఆదర్శంగా నిలిచింది. తిరిగి అదే కార్యదర్శి సత్యనారాయణ జీడిపల్లికి రావడంతో ఇక్కడ కూడా యువతలో గ్రామ పరిశుభ్రతపై అవగాహన కల్పించి వారిని కూడా స్వచ్ఛభారత్ వైపు తీసుకెళ్లి గ్రామ పరిశుభ్రతలో బాగస్వాములను చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువత కార్యదర్శి సత్యనారాయణను ప్రత్యేకంగా అభినందించారు. జీడిపల్లి యువతను కూడా ఆదర్శంగా తీసుకుని ఇతర గ్రామాల యువకులు కూడా స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చేపట్టి మండలాన్నే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మల్లన్న జాతర ఉత్సవాలు..

కన్నులపండువగా మల్లిఖార్జున స్వామి కళ్యాణం
హాజరైన ఎమ్మెల్యే రోహిత్



నవతెలంగాణ-మెదక్

మెదక్ మండలం మంబోజిపల్లి శివారులో గల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం జాతర ఉత్సవాలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న జాతర ఉత్సవాల్లో భాగంగా ఆలయ వంశానుగ్రత పూజారి మల్లయ్య, అర్చకులు మల్లిఖార్జున్ ల ఆధ్వర్యంలో తొలిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్ జాతర ఉత్సవాలకు హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి సన్మానించారు. ఉదయం నుంచి ఆలయంలో అఖండజ్యోతి ప్రజ్వలన, బ్రహ్మకలశ స్థాపన, గణపతిపూజ, నవగ్రహపూజ, స్వామివారికి రుద్రాభిషేకం, సహస్రబిల్వార్చన, మధ్యాహ్నం మల్లిఖార్జునస్వామి కళ్యాణం జరిపించి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి బండ్ల ఊరేగింపు జరుగగా, రాత్రి ఒగ్గు కథ చెప్పారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆదివారం సెలవా



11ఎంఎస్‌బి04

నవతెలంగాణ-మనోహరాబాద్

24 గంటలు ప్రజలకు వైద్య సేవలందించే ఆరోగ్య కేంద్రానికి వైద్యాధికారులు తాళం వేసి ఆదివారం సెలవును తీసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన పేషంట్లకు తాళం వేసి ఉండడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ సంఘటన మనోహరాబాద్ మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఆరోగ్య కేంద్రమంటనే ప్రతి నిత్యం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాల్సి ఉంటుంది. కానీ మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆదివారం కావడంతో సెలవును తీసుకున్నారు. ఏకంగా తాళం వేసి ఉంచారు. ఒక వేళ ఆసుపత్రిలో వైద్యాధికారులు లేకపోయిన సిబ్బంది అయినా అందుబాటులో ఉండి పేషంట్లకు ప్రాథమిక చికిత్సను అందించాల్సి ఉంటుంది. కానీ ఏకంగా వైద్య సిబ్బంది ఆరోగ్య కేంద్రానికే తాళం వేసేశారు. ఆరోగ్య కేంద్రానికి తాళం వేసి ఉండడంతో పేషంట్లు ఆసుపత్రికి వచ్చి వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇది మరి జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ స్వంత మండలం అయినప్పటికి వైద్య సిబ్బంది ఇంత నిర్లక్ష్యం వహించడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సీహెచ్ఓ బాల్‌నర్సయ్యను వివరణ కోరగా ఆసుపత్రికి తాళం వేసిన విషయం తనకు తెలియదని, తాళం వేశారా అన్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు మనోహరాబాద్ ఆరోగ్య కేంద్రంపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మనోహరాబాద్ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



నవతెలంగాణ-రామాయంపేట

శ్రీ రేణుకా ఎల్లమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో నల్ల పోచమ్మ బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి పంచమ సిద్ధయోగం పురస్కరించుకుని గ్రామంలో గ్రామ దేవతలకు బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. పోతురాజుల విన్యాసాలు, డోలు చప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఘనంగా అయ్యప్ప వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-రామాయంపేట



అయ్యప్ప వార్షికోత్సవ వేడుకలు రామాయంపేట పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పదవ వార్షికోత్సవం సందర్భంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 14 వరకు వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ జితేందర్ గౌడ్ తెలిపారు. ప్రత్యేక హోమంతో ఉత్సవాలను ప్రారంభించారు. ప్రతిరోజు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

అసైన్డ్ భూమిలో అధికారుల సర్వే

నవ తెలంగాణ-టేక్మాల్

నవతెలంగాణ స్పందన

'అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు' అనే శీర్షికతో 'నవ తెలంగాణ' పత్రికలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. మండల కేంద్రమైన టేక్మాల్‌లోని సర్వేనెంబర్ 1798/ ఆ , కృష్టారావు, మురళీల పేరు మీద నాలుగు ఎకరాల 38 గుంటల భూమి రిజిస్ట్రేషన్ అయి ఉండగా, అదనంగా మూడెకరాల 12 గుంటల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి చుట్టూ ఫెన్సింగ్ ప్రహరీ గోడ నిర్మించారు. 1798/ఆ భూమికి ఆనుకొని రెండెకరాల అసైన్డ్ భూమి ఉన్నది నిజమేనని అధికారులు తేల్చి చెప్పారు. ఈ భూమిని ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారి కిషన్ రావు, మురళిల నుంచి స్వాధీనం చేసుకొని పక్కనే ఉన్న కస్తూరిబా గాంధీ విద్యాలయానికిగాని, ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాల పిల్లలకు ఆట స్థలాలకు కేటాయించాల్సిందిగా అధికారులను ప్రజలు కోరుతున్నారు. అదనంగా సాగు చేస్తున్న మిగతా భూమిని కూడా స్వాధీనం చేసుకొని అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించుకోవాలని కోరుతున్నారు.





లక్ష్మాపూర్‌లో బెల్ట్ షాప్‌పై దాడి

నవతెలంగాణ-రామాయంపేట



లక్ష్మాపూర్ గ్రామంలో బెల్ట్ షాపులపై రామయంపేట పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశాల మేరకు స్థానిక పోలీసు లు రెండు బెల్ట్ షాపులపై దాడు లు నిర్వహించి పెద్ద మొత్తంలో మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

గృహజ్యోతికి దరఖాస్తులు చేసుకోవాలి

విద్యుత్ ఏఈ ఎన్టీఆర్ నాయక్

నవతెలంగాణ-రామాయంపేట : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకానికి రామాయంపేట విద్యుత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని రామాయంపేట విద్యుత్ ఏఈ పెంట్యా నాయక్ ఆదివారం తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి దరఖాస్తులు తీసుకోవాల్సి ఉండగా, తీవ్ర ఆలస్యం అవుతున్న నేపథ్యంలో విద్యుత్ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. లబ్ధిదారులు ప్రజా పాలన దరఖాస్తు రసీదు, కరెంటు బిల్లు నెంబర్, ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు), ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సిటిజన్ క్లబ్ అధ్యక్షులుగా నాయిని యాదగిరి



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

గజ్వేల్ సిటిజెన్ క్లబ్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ సిటిజన్ క్లబ్ ఎన్నికల అధికారిగా అమర నాగేందర్, సహాయ ఎన్నికల అధికారులుగా అర్సం శ్రీనివాస్, పోగుల రమేష్ వ్యవహరించారు. వారి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియకు నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, క్రీడల కార్యదర్శిలకు, ఒక్కొక్క నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఈ నామినేషన్ల ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. అనంతరం ఒక్కొక్క పదవికి ఒక్కటే నామినేషన్ రావడంం సభ్యులను ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది. అధ్యక్షులుగా నాయిని యాదగిరి, ఉపాధ్యక్షులుగా ఎన్.సీతారామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఏ సత్యనారాయణ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా దుంబాల భూపాల్ రెడ్డి, కోశాధికారిగా సుధా గాని మల్లయ్య గౌడ్, క్రీడల కార్యదర్శిగా గంగాల నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సిరిసినగండ్ల విద్యార్థినికి సాహిత్య పురస్కారం



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం సిరిసినగండ్ల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పుల్ల ఐశ్వర్య సాహత్య పురస్కారం అందుకుంది. హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాలసాహిత్య పీఠం ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులను బాలసాహిత్య పురస్కారాలకు ఎంపిక చేశారు. ఆదివారం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ఐశ్వర్యకు పురస్కారం అందజేశారు. ఐశ్వర్య రాసిన తేనెటీగ సామం అనే కథకు పురస్కారం లభించిందని ప్రధానోపాధ్యాయులు పెద్దవిఠల్ తెలిపారు.

బాలురకు కల్పించిన అవకాశాలు బాలికలకు కల్పించడం లేదు

నవతెలంగాణ-తొగుట

బాలురకు కల్పించిన అవకాశాలు బాలికలకు కల్పించడం లేదని ఆర్థిక అక్షరాస్యత నిపుణులు నాగరాజు అన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని తొగుట మండలంలోని అన్ని పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెంకటరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలురకు కల్పించిన అవకాశాలు బాలికలకు కల్పించడం లేదన్నారు. దేశ అభివృద్ధిలో స్త్రీ పురుషుల సమాన భాగస్వామ్యం ఎంతైన అవసరం ఉందని తెలిపారు. అలాగే వివిధ రకాల కారణాల వలన చదువుకున్న వయసులో పిల్లలు హెూటల్ లల్లో, పౌల్ట్రీ ఫామ్‌లలో, ఫ్యాక్టరీలలో, మెకానిక్ షాపులలో పనిచేస్తున్నారన్నారు. అలా ఎవరైనా పని చేస్తున్నట్టు మీకు తెలిస్తే 1098కి ఫోన్ చేయాలని సూచించారు. అలాగే మన చుట్టుపక్కల వాళ్లలో కొంతమంది మనతో ప్రేమగా మాట్లాడుతున్నట్టు నటిస్తూ మన శరీరంలోని రహస్య భాగాలపై టచ్ చేస్తూ



ఉంటారన్నారు. అలా ఎవరైనా చేస్తే వెంటనే తిరస్కరించడమే కాకుండా అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. దాంతోపాటు ఫోక్సో చట్టాన్ని వివరిస్తూ పోక్సో చట్ట ప్రకారం ఎవరి మీదనైనా కేసు నమోదు అయితే ఏడు సంవత్సరాలు మొదలుకొని జీవితాంతం జైలు పాలు కావాల్సి వస్తుందని. కొన్ని సందర్భాలలో ఉరిశిక్ష పడే అవకాశం ఉందని చెప్పారు. ఈ మధ్యకాలంలో విద్యార్థులు అందరూ సోషల్ మీడియాలో ఫేస్బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్‌లలో ఫోటోలు అప్లోడ్ చేస్తున్నారని అలా చేయడం మూలంగా ఇప్పటికే చాలామంది ఆ ఫోటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్నారు. దానివలన పరువుతో పాటు కొన్ని సందర్భాల్లో ఆసహనానికి గురై ప్రాణం తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భేటీ బచావో బేటి పడావో అంశంతోపాటు బాలికల సమృద్ధి యోజన, స్కాలర్ షిప్, మిషన్ వాత్సల్య ప్రధానమంత్రి మాతృ వందన యోజన, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, భరోసా కేంద్రం, అమ్మాయికి ఉచిత బస్సు సౌకర్యం, పోషణ అభియాన్, అంశాల గురించి సంపూర్ణంగా వివరించారు. అనంతరం చదువు పూర్తి చేసుకున్న తర్వాత మహిళలకు ఉండే ఉపాధి ఉద్యోగాల గురించి వివరించారు. మహిళలకు మిషన్ శక్తి ద్వారా ఆరోగ్య లక్ష్మి పథకం, సఖి కేంద్రం, సురక్ష ఋతు ప్రేమ, స్నేహిత కేంద్రం, ఒంటరి మహిళ పెన్షన్లు, ముద్ర లోన్లు, అన్నపూర్ణ పథకం, ఉజ్వల హెూమ్స్, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్, షీ టాక్సీ పథకం గురించి వివరించారు. అలాగే మహిళలకు గల చట్టాలు, మహిళలు గల హక్కుల గురించి, మహిళకు సంబంధించిన హెల్ప్ లైన్ నెంబర్స్ గురించి తెలి పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహిస్తే రాణిస్తారు

క్రీడాకారులకు జెర్సీల అందజేతలో కర్రావుల శంకర్



నవతెలంగాణ-బెజ్జంకి

క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సాహిస్తే వారంతటవారే రాణిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కర్రావుల శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెరకబండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కర్రావుల శంకర్ తన స్వంత ఖర్చులతో జెర్సీలను స్థానిక క్రికెట్ క్రీడాకారులకు అందజేశారు. క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు ఎళ్లవేళల అందజేస్తానని.. ఉత్తమ ప్రతిభ కనబరిచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని క్రీడాకారులకు శంకర్ సూచించారు. జెర్సీలను అందజేసిన శంకర్‌కు క్రీడాకారులు, పలువురు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ తరుపున ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ గ్రామ పంచాయతీలో గత కొద్ది రోజుల క్రితం ఎమ్.డి నుర్జహా అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ పార్టీ అభయహస్తం బృందం వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. అనంతరం కుటుంబానికి రూ.4 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కాంగ్రెస్ కార్యకర్తలు అందరికి పార్టీ తరుపున అండగా ఉంటామని తెలిపారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా దూది శ్రీకాంత్ రెడ్డి

నవ తెలంగాణ-సిద్దిపేట



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి శనివారం రాత్రి పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయనున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి అన్ని వర్గాల ప్రజలు, పార్టీ శ్రేణులు కలిసి వచ్చే విధంగా చూస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, డాక్టర్ లక్ష్మణ్, మురళీధర్ రావు, ఈటెల రాజేందర్, రఘునందన్ రావులతో పాటు జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి

నవ తెలంగాణ-సిద్దిపేట

భారతీయ గురుపరంపర, సంస్కృతి వల్ల దేశ ఖ్యాతి ప్రపంచంపై చెరగని ముద్ర వేస్తుందని పతంజలి యోగ పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్ అన్నారు. సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట బాలికల పాఠశాల గ్రౌండ్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారల పోటీలు జరిగాయి. తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భారత రాజ్య సంఘటన మంత్రి నందనం కృపాకర్ మాట్లాడుతూ యోగ విద్య అద్భుతమైతే, సూర్య నమస్కారాలు శ్రేష్టమైనవని తెలిపారు. అత్యధిక సూర్య నమస్కారాలు చేసిన వారికి బహుమతులను అందజేశారు. ఉత్సవంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, సిద్దిపేట జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు కే. రంగాచారి, సిద్దిపేట స్పోర్ట్స్ అథారిటీ కన్వీనర్ పాల సాయిరాం, సుడా పూర్వ



డైరెక్టర్ మచ్చ వేణుగోపాల్ రెడ్డి, జాతీయ యోగా మెడలిస్ట్, శిక్షకులు తోట సతీష్, సంధ్య యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామిరెడ్డి, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, గౌరవాధ్యక్షులు కె. అంజయ్య, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, ఉత్సవ కమిటీ కన్వీనర్లు చిప్ప ప్రభాకర్, రాజ్ కుమార్, గంగపురం శ్రీనివాస్, డాక్టర్ అరవింద్, సిరి చిల్డ్రన్ హాస్పిటల్ డాక్టర్ సాయి, జవాన్ గార్డింగ్ సర్వీస్ సతీష్ రెడ్డి, మల్లికార్జున్, పతంజలి యోగ సొసైటీ ప్రతినిధులు రంగాచారి పెద్ద వెంకటేష్ శివ శ్రీనివాస్, పాల్గొన్నారు.

గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన సీఐ సైదా

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఆస్పత్రికి వచ్చిన ప్రజలు రోగులకి ఎలాంటి సమస్యలు ఉన్నా గజ్వేల్ పోలీసుల దృష్టికి తీసుకురావాలని సీఐ సైదా అన్నారు. ఆదివారం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ సైదా మాట్లాడుతూ డాక్టర్లు, స్టాఫ్ నర్సులు రోగులతో స్నేహంగా ఉంటూ వారి రుగ్మతలను కనుక్కోవాలన్నారు. అంతేకాకుండా ఆస్పత్రిలో ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేయాలన్నారు. పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్లను నోటీస్ బోర్డ్‌లో అతికించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలు సమన్వయం పాటించి వైద్యులకు సహకరించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు ఏదైనా ట్రీట్మెంట్ విషయంలో సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. రోగులు సమ



న్వయం పాటించి సమస్యను పరిష్కరించుకునేందుకు వైద్యులతో క్రమశిక్షణతో ఉండాలన్నారు. వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజలతో దురుసుగా ప్రవర్తించకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-గజ్వేల్

వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీర్వాదంతో అందరూ బాగుండాలని అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుందన్నారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ రోజు అమ్మవారిని స్మరించుకుని పూజలు చేయడం అభినందనీయమని, సామూహిక వాసవి పారాయణం నిర్వహించిన మహిళలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి శంకర్ పంతులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు సిద్ది బిక్షపతి, భద్రయ్య, ఎర్రం శ్రీనివాస్, తోట బిక్షపతి, గోలి సంతోష్, నేతి శ్రీనివాస్, దొంతుల సత్యనారాయణ, నాగేంద్రం, చాపత్త శ్రీనివాస్, జగ్గయ్య గారి శేఖర్, కాశీనాథ్, కైలాస ప్రశాంత్, ఉమేష్, వెంకటేష్, గందే సంతోష్, ఆర్యవైశ్య నాయకులు మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-సిద్దిపేట

ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి మాత ఆత్మార్పణ చేసిన రోజును పురస్కరించుకొని భారత్ నగర్ ఆర్యవైశ్య ఫ్యామిలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయంలో వాసవి మాత చిత్రపటానికి పూలమాలతో అలంకరించి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మంకాల లింగమూర్తి, కార్యదర్శి శ్యాం ప్రసాద్, కోశాధికారి వెంకటేశం, పీఆర్ఓ జిల్లా శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు నేతి వేణు, సభ్యులు రాజ శ్రీనివాస్, యసాల వెంకట లింగం, సత్యనారాయణ, జగదీశ్వర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల కేంద్రంలో అన్నదానం

వాసవి క్లబ్ ఇందిరమ్మ కాలనీ వారి ఆధ్వర్యంలో అమ్మవారి ఆత్మ అర్పణ దినోత్సవం సందర్భంగా క్లబ్బు సభ్యుడు చీల లక్ష్మణ్ -పద్మ సహకారంతో పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ మంకాల శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షులు బెజగం కృష్ణమూర్తి, కూర శివకుమార్, మనోజ్ కుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నవ తెలంగాణ-కొండపాక

వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా కుకునూరుపల్లిలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి మహా పంచామృత అభిషేకం, కుంకుమార్చన, అమ్మవారి పారాయణం నిర్వహించారు. అనంతరం అల్పాహార, అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కాసం నవీన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాండురంగం, కొండపాక మండల వాసవి క్లబ్ అధ్యక్షులు ఉప్పల రాజు, సెక్రెటరీ శివకుమార్, కోశాధికారి కాపర్తి రాజ్ కుమార్, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు స్రవంతి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్త నర్సింలుకు బెస్ట్ సర్వీస్ అవార్డు



నవ తెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌కు చెందిన దేశబోయిని నర్సింలు గత ఇరువై సంవత్సరాలుగా యువజన సంఘాల నాయకుడుగా, సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నారని లైన్స్‌క్లబ్ సభ్యులు రాధాకృష్ణ తెలిపారు. శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులుగా పనిచేస్తున్న దేశబోయిన నర్సింలు సమాజం కోసం నిర్విరామ కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో భాగంగా లయన్స్ క్లబ్స్ వారు గజ్వేల్‌లో లయన్ గుడాల రాధ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఎక్సలెన్స్ రీజియన్ మీట్‌లో లయన్ ప్రముఖులలో బెస్ట్ సర్వీస్ అవార్డ్ అందజేయడం జరిగింది. సేవలను గుర్తించడం ద్వారా మరింత బాధ్యత పెరిగిందని అందుకు లయన్స్ క్లబ్ వారికి దేశబోయిని నర్సింలు ధన్యవాదాలు తెలిపారు.

బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడి వివాహానికి హాజరైన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నంగునూరు

బీఆర్ఎస్వీ నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు గోవిందారం రవి-లతశ్రీ వివాహానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. వయోల గార్డెన్‌లో జరిగిన వివాహానికి నంగునూరు మండలానికి చెందిన తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, సొసైటీ చైర్మన్లు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, బీఆర్ఎస్వీ నాయకులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు తదితరులు హాజరైనారు.

మైనార్టీలకు మొండిచెయ్యి చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం

మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

నవ తెలంగాణ-సిద్దిపేట



ఎన్నికల్లో మైనారిటీలకు పెద్ద పీట వేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి బడ్జెట్‌లోనే మొండిచెయ్యి చూపిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని హజ్ హౌస్‌లో ఉమ్రా యాత్రకు వెళుతున్న పదిమంది ముస్లిం యువకులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లాహ్ దయతో ఉమ్రా యాత్రను సంతోషంగా ముగించుకొని రావాలన్నారు. పేద ప్రజలు ఉమ్రా యాత్రకు వెళ్లేందుకు ప్రతి ఏటా నా స్వంత ఖర్చులతో పదిమందిని ఎంపిక చేసి పంపిస్తున్నట్లు చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ తర్వాత సిద్దిపేటలోనే హజ్ హౌజ్‌ను అన్ని హంగులతో నిర్మించుకున్నట్లు తెలిపారు. మంచి పనులు చేస్తే అల్లాహ్ దీవేనలుంటాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ. 4 వేల కోట్లు ప్రవేశపెడతామని చెప్పి రూ. 2,200 కోట్లు ప్రవేశపెట్టి మోసం చేసిందని తెలిపారు. మీ దీవెనలు ఎల్లప్పుడు అందించారని, ఎల్లప్పుడు మీకు అన్నీ వేళలో అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజనర్సు, కొండం సంపత్ రెడ్డి, పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, మోయిజ్, జావేద్, అహ్మద్, ఫక్రుద్దీన్, తాహెర్, గౌస్ మోహియొద్దీన్, ఫరీదొద్దీన్, అబ్దుల్ సమి, ముక్తి సలాం, అలామ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కులాన్ని ఎస్టి జాబితాలో చేర్చాలి

నవతెలంగాణ-సిద్దిపేట



వడ్డెర కులాన్ని బీసీ నుండి తొలగించి ఎస్టి జాబితాలో చేర్పించి, కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం పంపాలని తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ పట్టణ అధ్యక్షులు ఇరుగదిండ్ల తిరుపతి, జిల్లా అధ్యక్షులు కుంచం శేఖర్ లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్ లో వారు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు, చైర్మన్ శివరాత్రి అయిలమల్లు ఆదేశాల మేరకు విలేకరుల సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడిచిందని, ప్రభుత్వాలు మారుతున్నాయని, కానీ వడ్డెర్ల బతుకులో ఎలాంటి మార్పు రావడం లేదన్నారు. చదువుకునే వడ్డెర విద్యార్థులకు గురుకుల పాఠశాలలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని, వడ్డెర కార్మికులు వృత్తిలో ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. వడ్డెర కాంట్రాక్టర్లకు ప్రభుత్వ పనుల్లో 20 శాతం ఈఎండి లేకుండా పనులు కేటాయించి బండ క్వారీలపై వడ్డెర్లకు పూర్తి హక్కు కల్పించాలన్నారు. వడ్డెర జనాభా ప్రాతిపాదికన రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రవి, బిక్షపతి, యాదగిరి, మల్లేశం, అరవింద్, రవీందర్, స్వామి తది తరులు పాల్గొన్నారు.

మెయింటెనెన్స్ పేరుతో అక్రమ వసూళ్లు

న్యాయవాది, టౌన్ కాంగ్రెస్ నాయకులు బైరి ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-సిద్దిపేట



కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూం మెయింటెనెన్స్ పేరు మీద అక్రమ వసూళ్లు చేస్తున్నారని న్యాయవాది, టౌన్ కాంగ్రెస్ నాయకులు బైరి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్‌లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం కోసం కాంగ్రెస్ బృందం సందర్శించినట్లు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నదని, సీసీ రోడ్డు మీదనే మురికినీరు పారుతుందన్నారు. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అడుగగా ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదని, నెలకి ఒక ఇంటి పైన రూ 150 చొప్పున అక్రమ వసూళ్లు చేస్తున్నారని అన్నారు. మెయింటెయినెన్స్ డబ్బులను ఇస్మాయిల్ అనే వ్యక్తి వసూళ్లు చేస్తున్నాడని, అతన్ని అడుగగా కరెంట్ కట్ చేస్తాం, నీళ్ల కట్ చేస్తాం అని బెదిరిస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ నాయకులు ఎం.డీ గౌసుద్దిను, శివ కుమార్, విజయ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-తొగుట



బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం మండలంలోని గుడికందులలో సర్పంచ్ గంగనిగల్ల మల్లయ్య సతీమణి రాజవ్వ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి కుటుంబీకులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. రాజవ్వ మరణం పట్ల విచారం వ్యక్తం చేశారు. మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చా రు. అలాగే గ్రామానికి చెందిన బంగారు గళ్ల రాజయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భోంపల్లి మనోహరరావు, రొట్టె రాజ మౌళి పంతులు, మండల పార్టీ అధ్యక్షులు జీడి పల్లి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, ఎంపీటీసీ కొమ్ము శరత్, మాజీ సర్పంచ్ తోయేటి ఎల్లయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చిలువేరి మల్లారెడ్డి, నాయకులు తొయేటి ఎల్లం, బక్క కనకయ్య, పులిరాజు, గురు వారెడ్డి, బాల్రెడ్డి, నంట పరమేశ్వర్ రెడ్డి, రాజశేఖర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గృహ జ్యోతి పథకం కోసం వినియోదారులు సహకరించాలి

నవ తెలంగాణ-సిద్దిపేట : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసిన వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ మహేష్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తు నంబరు, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌ను మీ వద్దకు వచ్చే విద్యుత్ సిబ్బందికిగాని, మీకు దగ్గరలో ఉన్న విద్యుత్ కార్యాలయంలోగాని అప్పగించాలని కోరారు. ఈ నెల 14లోగా అప్పగించాలని సూచించారు.

వైస్ ఎంపీపీకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-తొగుట



వైస్ ఎంపీపీ బాసి రెడ్డి శ్రీకాంత్ రెడ్డికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం మండలంలోని కాన్గల్ గ్రామంలో వైస్ ఎంపీపీ బాసి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి నూతన గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి సమీపంలో గల సింగరాళ్ళ మల్లన్న దేవాలయం వద్ద జరిగిన ఆత్మీయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బూమ్‌పల్లి మనోహరరావు, రొట్టె రాజమౌళి పంతులు, మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, ఎంపీటీసీ కొమ్ము శరత్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చిలువేరి మల్లారెడ్డి, నాయకులు తొయేటి ఎల్లం, బక్క కనకయ్య, పులిరాజు, గురువారెడ్డి, బాల్ రెడ్డి, నంట పరమేశ్వర్ రెడ్డి, రాజశేఖర్, నర్సింహులు పాల్గొన్నారు.

బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేదేమిలేదు

నవతెలంగాణ-బెజ్జంకి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో సామాన్య ప్రజలకు ఒరిగేదేమిలేదని బీఎస్పీ మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బోనగిరి ప్రభాకర్ తెలిపారు. ప్రతి శాఖకు అరకొర నిధులు కేటాయించడం వల్ల బడుగుల జీవనానికి కావాల్సిన విద్య, వైద్యం, ఉపాధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలు ఇంకా నిద్రావస్థలోనే ఉన్నాయని, ఉద్యోగులకు నెల మొదటి రోజునే వేతనాలందజేస్తున్నామని వ్యాఖ్యలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో గురుకుల పాఠశాల ఉద్యోగులకు వెంటనే వేతనాలందించాలని కోరారు. భువనగిరి గురుకుల పాఠశాలలో ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లోని విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

టిపిఆర్ఎంఈ ఫోరం(టీఎన్జీవో) జిల్లా ఈసీ సభ్యత్వానికి రాజీనామా



నవ తెలంగాణ-రాయపోల్ : టీపీఆర్ఎంఈ ఫోరం(టీఎన్జీవో) జిల్లా ఈసి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు రాయపోల్ మండల జూనియర్ సహాయకులు ఏ ఆనందం పేర్కొన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ ఫోరం (టీఎన్జీవో) సిద్దిపేట జిల్లా సంఘంలో ఇ.సి. సభ్యునిగా ఎన్నికైన తాను ప్రాథమిక సభ్యత్వానికి, ఇ.సి. సభ్యత్వానికి చేస్తూ, రాజీనామా పత్రాన్ని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ ఫోరం టీఎన్జీవో జిల్లా అధ్యక్షులకు పంపించారు.

సూర్య నమస్కారం పోటీల్లో సత్తా శిశు మందిర్ విద్యార్థులు

నవ తెలంగాణ-గజ్వేల్ : సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సూర్య నమస్కారం పోటీలలో గజ్వేల్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు గోల్డ్, సిల్వర్ మెడల్‌లు సాధించారు. ఈ మేరకు శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల కరస్పాండెంట్ హరిణాపవన్ విద్యార్థులను అభినందించారు. శిక్షణ ఇచ్చిన పాఠశాల యోగా టీచర్ ప్రసన్న అభినందిస్తూ చిన్నారులకు ఆశీస్సులు అందించారు. సిద్దిపేట జిల్లా ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారని ఆయన తెలిపారు.



పేద మధ్యతరగతి ప్రజల బడ్జెట్

నవతెలంగాణ-సిద్దిపేట



ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదల సంక్షేమం, మధ్య తరగతి ప్రజల సంక్షేమ బడ్జెట్ అని మాజీ టీపీసీసీ మైనారిటీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ వహీద్ ఖాన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీల కొరకు కోట్ల రూపాయలు కేటాయించడమంటే కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల కోసం ఏ మేరకు కృషి చేస్తుందో ప్రజలకు అర్థమవుతుందన్నారు. భట్టి విక్రమార్క పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకొని, వారి కష్టాలు తీర్చడానికి బడ్జెట్‌లో ఈ నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఈ బడ్జెట్‌ను రూపొందించిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

కొత్త ఎస్ఐ దొంగతనాలను అరికట్టేనా?



నవతెలంగాణ-కౌడిపల్లి

కొత్తగా బాధ్యతలు తీసుకున్న కౌడిపల్లి ఎస్సై రంజిత్ రెడ్డి మండలంలో దొంగతనాలు ఎక్కువై ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న దొంగతనాలు ఆదివారం కౌడిపల్లి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రంజిత్ రెడ్డికి సవాలుగా మారాయి. పోలీసు నిఘా ద్వారా గ్రామాలలో దొంగతనాలు జరగకుండా పోలీస్ వ్యవస్థ గ్రామీణ స్థాయిలో పనిచేస్తే గ్రామాలలో దొంగతనాలు జరగవని ప్రజలు కోరుతున్నారు. గతంలో పోలీస్ స్టేషన్ కూత వేటు దూరంలో ఉన్న బస్టాండ్ మొబైల్ షాప్‌లలో వరుస దొంగతనాలు జరిగినా పోలీసులు పట్టించుకోవడం లేదని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం సంత రోజు మార్కెట్లో ఇప్పటివరకు కొన్ని వందల ఫోన్లు దొంగతనాలకు గురైనా పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రంజిత్ రెడ్డి అయినా నిఘాను పటిష్టం చేసి దొంగతనాలకు అడ్డుకట్టవేస్తారో లేదో చూడాలి మరి.

బడ్జెట్‌లో విద్యారంగానికి స్వల్పంగా పెరిగిన ప్రాధాన్యత

పిఆర్టియు టీఎస్ మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు

నవతెలంగాణ-తొగుట : బడ్జెట్‌లో విద్యారంగానికి స్వల్పంగా పెరిగిందని పిఆర్టియు టిఎస్ మండల అధ్యక్షులు రామచంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి కనకారెడ్డిలు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి విద్యారంగానికి కేటాయింపులు గతంలో కంటే ఈ సారి బడ్జెట్‌లో పెరిగాయని తెలిపారు. రూ.2,75,891.00 కోట్ల బడ్జెట్‌లో రూ. 21,389 కోట్లు విద్యారంగానికి కేటాయించారన్నారు. గత సంవత్సరం 6.7 శాతం కేటాయించగా, ఈ సారి 7.75 శాతం కేటాయించారన్నారు. మొత్తంగా విద్యారంగానికి కేటాయింపులు పెరిగినప్పటికీ కాంగ్రెస్ మానిఫెస్టోలో పేర్కొన్నట్లుగా 15 శాతం కెటాయించలేకపోయారని అసహనం వ్యక్తం చేశారు. మెగా డియస్సీ నిర్వహించాలని, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, అన్ని పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తామని నిర్ణయించటం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి మండలంలో అత్యాధునిక సౌకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు రూ. 500 కోట్లు ప్రతిపాదించారని,. అయితే ఈ పాఠశాలలు మండలానికి ఒకటి కాకుండా జనాభా ప్రాతి పదికన అవసరమైన చోట అదనంగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలనే పబ్లిక్ స్కూల్స్‌గా మార్చి అభివృద్ధి చేయాలన్నారు.

గుట్టుగా మట్టి దందా



- అనుమతుల్లేకున్నా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- గ్రామాల్లో గుట్టుగా విస్తరిస్తున్న మట్టి మాఫియా
- అధికారులకు సమాచారం చేరడంతో వాహనాలు వదిలి డ్రైవర్ల పరారు

నవతెలంగాణ-బెజ్జంకి

మట్టి మాఫియాదారులు గుట్టుగా వ్యవహరిస్తూ సంబధిత అధికారుల కళ్ళుగప్పి రాత్రింబవళ్ల జిల్లాయేతర ప్రాంతాలకు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ శివారులో రైతుల భూముల్లోని ఎర్రమట్టిని గత వారం రోజులుగా లారీల సహాయంతో తరలిస్తున్నారు. మట్టి మాఫియాదారులు ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తూ సంబధిత అధికారుల అనుమతుల్లేకుండా యథేచ్ఛగా జేసీబీ,లారీల సహాయంతో మట్టి దందా సాగించడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆదివారం మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామ శివారు నుంచి సాగుతున్న అక్రమ మట్టి దందా సమాచారం రెవెన్యూశాఖ అధికారులకు తెలియడంతో తహసీల్దార్ ఎర్రోల్ల శ్యామ్ వెంటనే స్పందించి మట్టి రవాణ చేస్తున్న వాహనాలను తహసీల్ కార్యాలయానికి తరలించాలని సిబ్బందికి అదేశాలు జారీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ సంతోష్, తహసిల్ కార్యాలయ సిబ్బంది సంపత్ సహాయంతో మట్టి రవాణ చేస్తున్న వాహనాలను తహసిల్ కార్యాలయానికి తరలించేందుకు సిద్ధమైన క్రమంలో వాహనాలకు సంబంధించిన ధృవపత్రాలతో సోమవారం తహసిల్ కార్యాలయంలో వాహనాల యాజమానుల హజరవ్వాలనే తహసిల్దార్ సూచన మేరకు వెనుదిరిగినట్టు సిబ్బంది తెలిపారు. అక్రమంగా మట్టి రవాణ చేస్తున్న వాహనాలపై ఉపేక్షించిన తీరుపై తహసిల్దారును వివరణ కొరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

లారీలను వదిలేసి వెళ్లిన డ్రైవర్లు

అక్రమ మట్టి తరలింపు సమాచారం సంబధిత అధికారులకు తెలియడంతో డ్రైవర్లు లారీలను మట్టి తవ్వకాలు జరిపే ప్రాంతంలో వదిలేసి వెళ్లడంతో తహసిల్దార్ కార్యలయ సిబ్బంది విస్మయానికి గురయ్యారు. పోలీస్ శాఖ అధికారుల అదేశాలతో సంబంధిత మట్టి మాఫియాదారుడు డ్రైవర్లను లారీల వద్దకు పంపించడం కోసమెరుపు.

వ్యాపారస్తుల మోసపూరిత లీలలు

మండల కేంద్రంతో పాటు మండలంలోని రాజీవ్ రహదారి అనుకుని ఉన్న భూములకు అధిక ధరలు పలుకుతుండడంతో పలువురు వ్యాపారులు ప్రభుత్వ అనుమతుల్లేకుండా అక్రమ దందాకు పాల్పడుతున్నారు. వ్యాపారస్తులు నల్లరేగడి భూములను కొనుగోలు చేసి ఎర్రమట్టితో చదును చేసి వెంచర్లు ఏర్పాటు చేస్తుండడంతో మండలంలో ఎర్ర మట్టికి భారీగా డిమాండ్ పెరిగింది. డిమాండ్‌ను మట్టి మాఫియాదారులు ఆసరాగా చేసుకుని అధికారులు విధులు ముగించుకుని అందుబాటులో లేని సమయంలో మట్టి దందాను జోరుగా సాగిస్తున్నారు. ఎర్రమట్టితో పైపైన చదును చేసిన వెంచర్లలోని ప్లాట్లను ఆసక్తి ఉన్న కొనుగోలుదారులకు వ్యాపారస్తులు అధిక ధరలకు విక్రయిస్తూ మోసం చేస్తున్నారు. మట్టి మాఫియాదారులు, వెంచర్ వ్యాపారస్తులు సంయుక్తంగా కలిసి అధికారుల కళ్లుగప్పి ఎలాంటి అనుమతుల్లేకుండా ఇటు ప్రభుత్వానికి భారీగా గండికొడుతూ, అటు ప్రజలను మోసం చేస్తున్నారనే అభిప్రాయాలు మండలంలో వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి అక్రమ మట్టి రవాణ, అనుమతుల్లేకుండా వెలుస్తున్న వెంచర్లపై కఠినంగా వ్యవహరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

భక్తులకు కనీస సౌకర్యాల ఏర్పాటులో పాలకమండలి విఫలం





సిపిఎం పార్టీ మండల నాయకులు తేలు ఇస్తారి

నవ తెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న జాతర భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకమండలి పూర్తిగా విఫలమైందని సిపిఎం పార్టీ మండల నాయకులు తేలు ఇస్తారి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ ఎదురుగా మురికి నీరు రోడ్డుపైకి వచ్చి భక్తులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. గత నాలుగు వారాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతుందని పునరుద్ధరణ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. భక్తులు వేసే కానుకలతో కోట్ల రూపాయల ఆదాయం దేవాలయానికి ఉన్నా భక్తులకు సౌకర్యాలు మాత్రం మెరుగుపరచడం లేదన్నారు. ఆలయ అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

మండల వాసులకు ఉత్తమ జాతీయ పురస్కారాలు



నవతెలంగాణ-బెజ్జంకి

పలువురు మండల వాసులు బహుజన సాహిత్య అకాడమి అధ్వర్యంలో అందజేసే ఉత్తమ జాతీయ పురస్కారాలు వరించాయి. మండల కేంద్రానికి చెందిన హైకోర్ట్ న్యాయవాది, న్యాయ కళాశాల ప్రధానాచార్యులు ఎలుక రవీంద్ర ప్రసాద్ (విద్యారత్న), రామంచ రవీందర్ (ఉత్తమ ఉపాధ్యాయ), ముత్తన్నపేట గ్రామానికి చెందిన బొర్ర సురేశ్(డాక్టర్ బీఆర్ అంబేద్కర్)ఉత్తమ జాతీయ పురస్కారాలను ఆదివారం అంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో నిర్వహించిన దక్షిణ భారత బహుజన రచయితల సమావేశంలో బహుజన సాహిత్య అకాడమి నల్లా రాధాకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా పురస్కారాలు అందుకున్న వారిని బహుజన సాహిత్య అకాడమి సభ్యులు శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు.ఉత్తమ జాతీయ పురస్కారాలు అందుకున్న మండల వాసులను పలువురు ఉపాధ్యాయులు, న్యాయవాదులు,స్వేరోస్ నెట్ వర్క్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలి



16న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

సిఐటీయు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య

నవతెలంగాణ జగదేవపూర్

గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో జగదేవపూర్ మండల గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం ఆదివారం మునిగడపలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలు అన్నిటిని రద్దుచేసి నాలుగు కోడ్లు రూపొందించడం జరిగిందన్నారు. దీని ద్వారా కార్మికులకు కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు హక్కులు కోల్పోవడం జరుగుతుందని 12 గంటల పని విధానం తీసుకురావడం జరుగుతుందన్నారు. ప్రజల మధ్య కులం పేరుతో మతం పేరుతో విభజన చేసి కార్మికులలో ఐక్యతను విచ్ఛిన్నం చేసే చర్యలు చేస్తుందని విమర్శించారు. ప్రజలపై పన్నుల భారం పెంచి పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచిందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఈ పది సంవత్సరాల కాలంలో సుమారు 15 కోట్ల మంది ఉపాధి కోల్పోయారన్నారు. రైతులకు వ్యవసాయ కూలీలకు నష్టం చేసే విధానాలు రూపొందించిందని ఉపాధి హామీ కార్మికులకు ఆధార్‌తో పాటు పని ప్రదేశాల్లో ఫోటోలు తీసి ఆన్లైన్ చేయాలన్నారు. దీంతో కోట్లాదిమంది ప్రజలు ఉపాధి పనికి దూరమవుతున్నారన్నారు. సుమారు 14.34 లక్షల కోట్ల రూపాయలు ధనవంతులకు కట్టబెట్టిందన్నారు కార్మికుల రైతాంగం , వ్యవసాయ కార్మికుల రక్షణ కోసం 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు ప్రజలందరూ ప్రజానీకం పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రంగారెడ్డి నర్సింలు యాదగిరి కనకవ్వ రేణుక స్వామి బిక్షపతి రమేష్ లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలి



టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి

నవ తెలంగాణ-సిద్దిపేట

న్యాయపరమైన చిక్కులను తొలగించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా విస్తృత కమిటీ సమావేశం ఆదివారం సంజీవని పారా మెడికల్ కాలేజీలో జిల్లా అధ్యక్షులు షేక్ వలీ హమ్మద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చొరవతో రాష్ట్ర ప్రభుత్వం కోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో ఈ నెల 13కు వాయిదా వేసిన విషయం తెలిసిందేనన్నారు. మరింత పట్టుదలతో విద్యా వ్యవస్థను కాపాడుకునే విషయంలో బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలన్నారు. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం ఈ బడ్జెట్లో విద్యారంగానికి కేటాయింపులు స్వల్పంగా పెంచడం అభినందనీయమన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఏ .సింహాచలం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని(సిపిఎస్)రద్దు చేస్తానని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక భద్రతను కల్పించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 5లోగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గురుకుల ఉపాధ్యాయుల, కస్తూరిబా బాలికల విద్యాలయంలో, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జీఓ 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరిని స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలని, ఆగిపోయిన స్పోజు బదిలీలను పూర్తి చేయాలని, పండిట్, పి ఇ టి ల అప్‌గ్రేడేషన్ సమస్యను పరిష్కరించి పండిట్, పి ఇ టి లకు ప్రమోషన్లు ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న మూడు డిఏలను వెంటనే విడుదల చేయాలని సమావేశంలో తీర్మానం చేశారు. కార్పోరేట్, ప్రవేటీకరణకు ఉతమిచ్చి అంతరాలను పెంచే విధంగా రూపొందించిన జాతీయ విద్యావిధానం 2020ని రద్దు చేయాలని సమావేశంలో తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె . ప్రభావతి, జిల్లా ఉపాధ్యక్షులు చిర్రా యాదగిరి , జిల్లా కోశాధికారి ఎం.కృష్ణ , జిల్లా కార్యదర్శులు జి. వెంకట కిరణ్ , కె.కనకరాజు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ టీ. శివలింగం, సోషల్ మీడియా కన్వీనర్ జి. ప్రవీణ్ కుమార్, కేజీబివి జిల్లా కన్వీనర్ సిహెచ్ హేమల, సావిత్రి, రామచంద్ర, నర్సింలు, రాజమల్లు,గణేష్ రెడ్డి, సక్రియ, శివుడు, రాజనర్సింహ,రామచంద్రం,కనకరాజు, కృష్ణమూర్తి, కనకయ్య, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా లోని అన్ని మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పేద అమ్మాయికి పెళ్లి చేసిన అలయన్స్ క్లబ్ ప్రతినిధులు



నవ తెలంగాణ-సిద్దిపేట

నిరుపేద అమ్మాయి తేజస్వినికి కొండాపూర్ గ్రామానికి చెందిన గణేష్‌తో పెళ్లి కుదరగా అలయన్స్ క్లబ్ సిద్దిపేట జిల్లా గవర్నర్ సోమవనజ ఆధ్వర్యంలో స్థానిక కోటిలింగాల దేవాలయంలో ఆదివారం ఘనంగా పెళ్లి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అలయన్స్ క్లబ్స్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 8 పెళ్లిళ్లు చేసినట్లు తెలిపారు. హిందూ సంప్రదాయం ప్రకారం, పూర్తి లాంచనాలతో, వచ్చిన అతిథులకు సుమారు 400 మందికి భోజనాలతో సహా పెళ్లిళ్ల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్స , ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్స్ అత్మరాములు, వైకుంఠం , ఫాస్ట్ గవర్నర్ రాజేశ్వర్ రెడ్డి, వైస్ గవర్నర్లు శివకుమార్ , రామచంద్రం, ఆర్ సి లు ,జెడ్ సి లు, అన్ని క్లబ్ల అధ్యక్షులు , కార్యదర్శులు ,కోశాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ చిత్తారి పద్మకు జాతీయ అవార్డు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

బహుజన సాహిత్య అకాడమీ 7వ జాతీయ సౌత్ ఇండియా తిరుపతిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్ చిత్తారి పద్మకు ఉత్తమ కౌన్సిలర్‌గా జాతీయ అవార్డ్‌ను ప్రముఖ సినీ గేయ రచయిత మిట్టపెల్లి సురేందర్ అందజేశారు. హుస్నాబాద్‌లో ఏడో వార్డు కౌన్సిలర్‌గా చిత్తారి పద్మ ప్రజలకు చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ఇతర రాష్ట్రాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కూడవెల్లి వాగులో అదృష్టమైన వ్యక్తి లభ్యం



నవ తెలంగాణ-మిరుదొడ్డి

మిరుదొడ్డి మండల కేంద్రంలో మూడు రోజుల క్రితం మాఘ అమావాస్య రోజున కూడా వెళ్లి వాగులోకి స్నానానికి వెళ్లిన వ్యక్తి గల్లంతైన విషయం తెలిసిందే. వాగు వద్ద గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం ఉదయం మిరుదొడ్డి శివారులోని వాగులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్థానికుల సహాయంతో పోలీసులు బయటికి తీసి మద్దెల స్వామిగా గుర్తించారు. స్వామి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మాఘ అమావాస్యను పురస్కరించుకొని స్నానం చేయడానికి వాగులోకి దిగిన స్వామి నీటి ప్రవాహానికి గల్లంతయి విగత జీవిగా కనిపించాడు. మృతుడికి భార్య సౌమ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులతో పాటు గ్రామస్తులు కోరారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



నవతెలంగాణ-మర్కుక్

పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండల ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి అన్నారు. ఆదివారం అయన నవతెలంగాణతో మాట్లాడుతూ తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. బడ్జెట్‌లో అన్ని వర్గాలకు లబ్ది చేకూరేవిధంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలలో ఆరు గ్యారంటీలకు ఒక్కొక్కటి అమలు చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన లబ్ధిదారులు గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మంత్రాల చేస్తున్నాడనే నేపంతో హత్య



రెండు రోజుల్లో నిందితులను పట్టుకున్న పోలీసులు

నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలింపు

నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామ శివారులోని పిట్టల వాడ వద్ద ఈ నెల 9వ తేదిన సగం కాలిన స్థితిలో మృతదేహం పడి ఉండడం స్థానికంగా కలకలం రేపింది. కాగా ఆ కేసు ను చాలేంజింగ్ గా తీసుకున్న రూరల్ సీఐ శ్రీను అత్యాదునిక టెక్నాలజీని ఉపయోగించి రెండు రోజుల్లోనే మిస్టరిని చేదించి, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామానికి చెందిన నిమ్మ భూమయ్య(56) తన కుటుంబ సభ్యులతో కలసి సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. కాగా భూమయ్య తమ్ముడు కనకయ్య కుటుంబ సభ్యులకు గత కొన్ని రోజుల నుంచి ఆరోగ్యం బాగా ఉండక పోవడంతో, భూమయ్య తన కుటుంబ సభ్యులపై మంత్రాలు చేశాడని కనకయ్య కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 8న భూమయ్య తల్లికి ఆరోగ్యం బాగా లేకపోతే కొడుకు ప్రవీణ్‌తో కలసి నామాపూర్ గ్రామంలోని కనకయ్య ఇంటికి తన తల్లిని చూడడానికి ఇద్దరు కలిసి బస్సులో సిద్దిపేట నుంచి వెళ్లారు. అక్కడికి వెళ్లిన తర్వాత గొడవలు జరగడంతో మంత్రాలు చేస్తున్నాడని కనుకయ్య, తన కుటుంబ పరువు తీస్తున్నాడని భూమయ్య కొడుకు ప్రవీణ్‌లు భూమయ్యను చంపాలని నిర్ణయించుకొని పురుగుల మందు కొన్నారు. ఆ తర్వాత రెండు బీర్లు, ఓసి ఆఫ్ బాటిల్ తీసుకొని బండి మీద నామాపూర్ నుండి సిద్దిపేటకు బయలుదేరారు. రాఘవపూర్ గ్రామ శివారికి రాగానే పిట్టలవాడ పక్కన గల పంట పొలాలలో ముగ్గురు కలిసి ఆల్కహాల్ ను గ్రాగే సమయంలో, ప్రవీణ్ ఆల్కహాల్ లో పురుగుల మందును కలిపి తన తండ్రి భూమయ్య కు ఇచ్చాడు. అది తాగిన భూమయ్య పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగానే కొడుకు, తమ్ముడు ఇద్దరు కలసి టవల్‌తో మూతి పైన మెడ పైన గట్టిగా నొక్కి చంపేసారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు భూమయ్య ముఖం, శరీరంపై అక్కడే ఉన్న గడ్డిని వేసి నిప్పంటించి, అదే బండిపై నామంపూర్ కి వెళ్లిపోయినట్లు తెలిపారు. మంత్రాలు తంత్రాలు అంటూ మూఢనమ్మకాలతో గ్రామాలలో కక్షలు పెంచుకొని వ్యక్తులను దారుణంగా చంపడం మంచిది కాదని సీఐ హితవు పలికారు. ఈ సమావేశంలో సిద్దిపేట రూరల్ ఎస్ఐ కిరణ్ రెడ్డి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే హామీలను మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం



మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

నవ తెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద లబ్దిదారులకు తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నేడు అధికారంలోకి రాగానే మాట మార్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆడపిల్లకు అండగా ఉండేందుకు షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాన్ని మాజీ సీఎం కేసిఆర్ ప్రారంభించారని తెలిపారు. పదేళ్ల ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని 13 లక్షల పేదింటి ఆడపిల్లల పెళ్ళిళ్లకు రూ. 12 వేల కోట్లు ఆర్థిక సహాయం అందించామన్నారు. వృద్దులకు ఆసరా కింద రూ 4 వేలు పెన్షన్ అందిస్తామని కాంగ్రెస్ అబద్దాలు చెప్పారని తెలిపారు. 4వేలు కాదు కదా కనీసం గత రెండు నెలలు జనవరి, ఫిబ్రవరికి సంబంధించి రూ. 2వేల పెన్షన్‌ను ఇంతవరకు చెల్లించలేదన్నారు. వ్యవసాయం సంబంధించి 24 గంటల విద్యుత్ అందిస్తామని చెప్పి, కనీసం 16 గంటలు కూడా విద్యుత్ సరఫరా ఇవ్వడం లేదని మండిపడ్డారు. విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజనర్సు, రవీందర్ రెడ్డి, పాల సాయిరాం, జాప శ్రీకాంత్ రెడ్డి, కొల రమేష్ గౌడ్, కౌన్సిలర్ గ్యాదరి రవీందర్, బిఆర్ఎస్ నాయకులు మొయిజ్, రెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కలప తరలిస్తున్న డీసీఎంలు పట్టివేత



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

ఎలాంటి పర్మిషన్ లేకుండా చెట్లు నరికి అక్రమంగా కలప తరలిస్తున్న రెండు డీసీఎంలను పట్టుకున్నట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం శనివారం అర్ధరాత్రి సమయంలో సిద్దిపేట రూరల్ మండలం బండ్ల చర్లపల్లి గ్రామ శివారులో రెండు డీసీఎంలలో అక్రమంగా కలప తరలిస్తున్నారన్న నమ్మదగిన సమాచారంపై తాము అక్కడకు చేరుకుని వాహనాలను పట్టుకుని రూరల్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తు లక్ష్యం భావితరాలు బాగుపడాలనే అడవుల పచ్చదనం పెంచే చెట్లను ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా నరికి కలపను అమ్ముకునే వారిపై, ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా చేసినా, పేకాట, జూదం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన కలిగి ఉన్నా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటువంటి సమాచారం ఉంటే వెంటనే డయల్ 100, సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 8712667447, 8712667446, నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలి



వికలాంగుల పెన్షన్లను వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ -దుబ్బాక

శారీరక వికలాంగులకు ఉద్యోగ నియామకాల్లో అడ్డంకిగా ఉన్న రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌ను మార్చాలని , ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ వికలాంగుల పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఎండీ.సాజిద్ డిమాండ్ చేశారు. ఆదివారం దుబ్బాకలో వారు విలేకరులతో మాట్లాడారు. రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వికలాంగుల పెన్షన్ లను వెంటనే విడుదల చేయాలని, అలాగే వారికి అంత్యోదయ రేషన్ కార్డులు (ఏఏవై) లను వెంటనే జారీ చేయాలన్నారు.రాష్ట్ర బడ్జెట్ లో వికలాంగుల సంక్షేమానికి 5 శాతం నిధుల్ని కూడా కేటాయించకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 40 లక్షల మంది వికలాంగుల్లో కొంతమందికే ఆసరా పెన్షన్ లు వస్తున్నాయని అందరికీ పెన్షన్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు 4 శాతం కేటాయించాలన్నారు. వికలాంగుల మానసిక ఆరోగ్య సంరక్షణ కుటుంబ మంత్రిత్వ శాఖ ద్వారా వికలాంగుల సాధికారిక విభాగానికి (డీఈపీడబ్ల్యూడీ) నిధులను పెంచాలని, వికలాంగుల ఉపకరణాలపై కేంద్రం విధించిన జీఎస్టీని ఎత్తివేయాలని ,ఉపాధి హామీలో పని చేస్తున్న వికలాంగులందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వికలాంగులు లక్ష్మీ నర్సయ్య యాదగిరి, ప్రభాకర్, లస్మయ్య పలువురున్నారు.

విద్యార్థుల విజ్ఞాన విహారయాత్ర





నవ తెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ ప్రాథమిక పాఠశాల కోదండరాంపల్లి పాఠశాలల విద్యార్థులు ఎప్పుడు పుస్తకాలతో పోటీ పడడం కాకుండా విజ్ఞాన విహారయాత్ర కోసం రామోజీ ఫిలిం సిటీ అందాలను వీక్షించడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు మధునాలా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు రామోజీ ఫిలిం సిటీలో సినిమాలు ఎలా తీస్తారు అనే విషయాలను తెలుసుకున్నారన్నారు. అదేవిధంగా అందులో ఉన్న పక్షులు, జంతువులను పరిశీలించారు. రామోజీ ఫిలిం సిటీ వాతావరణాన్ని విద్యార్థులు ఆస్వాదించారని తెలిపారు. ఉపాధ్యాయులు వసంత, ప్రేమలత, జ్యోతి, భాగ్య, శ్యామల, శ్రీశైలం, 58 మంది విద్యార్థులు విహార యాత్రకు వెళ్లారని తెలిపారు.

అంబేద్కర్ తాత్వికత వ్యాప్తికే విశ్వ జన కళా మండలి



నవతెలంగాణ-సంగారెడ్డి

బుద్ధ అంబేద్కర్ పూలే కాన్షిరాం తాత్వికతను వ్యాప్తికే విశ్వ జన కళా మండలి పనిచేస్తుందని సంఘం అధ్యక్షులు మాస్టర్ జీ అన్నారు. ఆదివారం సంగారెడ్డిలోని టిపిటిఎఫ్ కార్యాలయంలో జాతీయ విశ్వజన కళామండలి సమావేశం రిటైర్డ్ ప్రిన్సిపాల్ అనంతయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షులు మాస్టర్ జీ హాజరై మాట్లాడుతూ గౌతమ బుద్ధ అంబేద్కర్ పూలే కాన్షిరాం తాత్వికతను వ్యాప్తి చేసే ప్రధాన ఎజెండానే విశ్వ జన కళా మండలి ఎజెండా అన్నారు. వారి ఆశయ సాధన కోసం కృషి చేస్తామని ప్రజల చైతన్య పరిచేందుకే కళామండలి ఉందని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు బీరయ్య యాదవ్ మాట్లాడుతూ జనాభా ప్రకారం ఎవరి వాటా వారికి దక్కాలని అన్నారు. బీసీ లకు మరింత రాజకీయ భాగస్వామ్యం ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవయ్య, గొల్ల ఆంజనేయులు, ముప్పారం పద్మారావు, సుమలత, మీనాక్షి , మధు, చంద్ర, రమేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మధు చంద్ర ప్రధాన కార్యదర్శిగా బాలరాజ్ మహిళా అధ్యక్షురాలుగా సుమలత ప్రధాన సలహాదారుగా బీర యాదవ్ లను ఎన్నుకున్నారు.